

పెద్దాపురం ఏడీబీ రోడ్డులో అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కిన కారు

ఫోన్ పడిపోయింది.. కారు డివైడర్ ఎక్కింది..!

పెద్దాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సామర్లకోట-పెద్దాపురం మధ్య ఏడీబీ రహదారిలో అదుపుతప్పిన ఓ కారు డివైడర్‌పైకి ఎక్కేసింది. కాకినాడ నుంచి రాజమహేంద్రవరానికి ఓ వ్యక్తి తన పిల్లలను తీసుకువెళ్తున్నాడు. డ్రైవింగ్ సమయంలో ఆ వ్యక్తికి ఫోన్ రావడంతో అతను లిఫ్ట్ చేసి మాట్లాడుతున్నాడు. ఇంతలో ఫోన్ చేతిలోనుంచి జారి కిందకు పడిపోయింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ఎవరికీ ప్రమాదం జరగకపోవడం విశేషం.

పెళ్లంటే..!

ఆకాశం దిగివచ్చి మబ్బులతో వేయాలి మన పందిరి.. ఊరంతా చెప్పుకునే ముచ్చటగా జరగాలి పెళ్లంటే మరి.. ప్రస్తుతం అందరూ ఇదే ట్రెండ్ అనుసరిస్తున్నారు.. ఈ మూడు నెలలూ వివాహ ముహూర్తాలు ఉండడంతో అప్పుడే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి వచ్చేసింది.. - వివరాలు 6వ పేజీలో



'రంగరాయ'లో వైద్యవిద్యార్థులకు ఘన స్వాగతం



మాట్లాడుతున్న డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 14: రంగరాయ వైద్యకళాశాల-24 బ్యాచ్ వైద్యవిద్యార్థులకు సోమవా రం జరిగిన ఆవిష్కరణ వేడుకలో ఆత్మీయంగా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, డీఎంఈ, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం వైద్యవిద్యార్థుల భవిష్యత్తు, లక్ష్యం, దార్శనికతపై ప్రసంగించారు. అనంతరం ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ భారత వైద్యవిద్యార్థుల పాత్ర అనే అంశంపై మాట్లాడారు. మరో వైస్ ప్రిన్సిపాల్ డీవీఎస్ శశి మాట్లాడుతూ కృషి, అంకిత భావం విలువను వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్, పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి, బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ వి.భాగ్యలక్ష్మి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ, స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, అనాటమీ అసో సియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.లలిత, డాక్టర్ ప్రమోదిని, డాక్టర్ వీరయ్య, డాక్టర్ సతీష్, డాక్టర్ విద్య వైద్యవిద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు నియామక ఉత్తర్వులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 14: విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల నియామక ఉత్తర్వులను కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం అందజేశారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో అర్హత సాధించిన ఆరుగురికి ఉత్తర్వులు అందజేశారు. దీనిలో ఇద్దరు అంధ విద్యార్థులు, ఒక మానసిక విభిన్న ప్రతిభావంతులు, ముగ్గురు బధిర అభ్యర్థులకు బ్యాక్ లాగ్ పోస్టుల్లో నియమించారు.

'లాటరీ' కొట్టేశారు!

- తీవ్ర ఉత్కంఠ నడుమ అదృష్టవంతులను వరించిన మద్యం దుకాణాలు
- మొత్తం 155 దుకాణాల్లో 149 పురుషులకు, మహిళలకు ఆరు
- సిండికేట్‌గా ఏర్పడి 90 దుకాణాలకుపైగా దరఖాస్తులు చేసినవారందరికీ షాకులే షాకులు
- రెండు లేదా మూడే దుకాణాలు తగలడంతో ఈసురోమన్న వైనం



కాకినాడ కలెక్టరేట్‌లో మద్యం దుకాణాల లాటరీకి హాజరైన దరఖాస్తుదారులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/కాకినాడ కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అడుగడుగునా ఉత్కంఠ.. అదృష్టలక్ష్మి ఎవరిని వరిస్తుందోనన్న ఆశ.. కోట్లకు కోట్లు పెట్టి దరఖాస్తులు చేసినందున కొన్నయినా దుకాణాలు దక్కకపోతాయా అన్న సిండికేట్ల లెక్కలు.. అప్పుచేసి రూ.2లక్షలతో దరఖాస్తు చేసిన తమకు లాటరీ వరించకపోదా అని మరికొందరు సామాన్యుల అంచనాలు.. అమెరికాలో ఉంటున్నా స్వస్థలంలో తమ పేరుపై ఓ మద్యం దుకాణం ఉంటే అదో కిక్ అనుకుని దరఖాస్తు చేసిన ఎన్ఆర్ఐల ఎదురుచూపులు ఒక్కపక్క. వెరసి జిల్లాలో కొత్త మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం 2.30గంటలతో ముగిసింది. మొత్తం 155 దుకాణాలకు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించిన లాటరీలో 149 పురుషులకు, ఆరు మద్యం దుకాణాలు మహిళలను వరించాయి. లక్షలకు లక్షలు వెచ్చించి పదుల సంఖ్యలో దుకాణాలకు హస్తగతం చేసుకోవాలనుకున్న సిండికేటకు మాత్రం లాటరీలో చుక్కలు తగిలాయి. ఒకటీ..అరా షాపులు తప్ప పెద్దగా చేతికి చిక్కకపోవడంతో వారంతా ఆర్థికంగా గట్టిగానే దెబ్బతిన్నారు. వస్తే వచ్చింది లేదంటే లేదనుకుని రూ.2లక్షలు అప్పు చేసిన దరఖాస్తు చేసుకున్నవారికి పలుచోట్ల లాటరీ వరించింది. వెరసి లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారంతా బుధవారం నుంచి మద్యం విక్రయాలు ప్రారంభించాలని ఎక్సైజ్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది.

కోలాహలమే..

కొత్త మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరం, పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సమక్షంలో ఉదయం 8గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 2.30 గంటలకు కేటాయింపు ముగిసింది. తొలుత కలెక్టర్ కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ప్రారంభించగా, అదే సమయంలో జేసీ, కాకినాడ ఆర్డీవో పలు దుకాణాలకు లాటరీ తీశారు. జిల్లాలో మొత్తం 155 మద్యం దుకాణాలకు 3,332మంది దరఖాస్తు చేసుకోగా వారంతా కలెక్టరేట్‌కు లాటరీకోసం రావడంతో అంతా కిక్కిరిసిపోయింది. ఉదయం 7గంటల నుంచిమధ్యాహ్నం 3గంటల వరకు రద్దీ కొనసాగింది. దరఖాస్తు చేసి ఎంట్రీపాస్ ఉన్న వారినే కలెక్టరేట్‌లోకి ప్రవేశం కల్పించారు. మరో పక్క గొడవలు ఆందోళనలు జరగకుండా కలెక్టరేట్ ఎదుట భారీగా పోలీసులను మోహరించారు. లాటరీలో 149 దుకాణాలు పురుషులకు రాగా, ఆరు దుకాణాలు మహిళలను వరించాయి. ఒక్కో షాపునకు లాటరీ తీయగా మద్యం దుకాణం వరించిన వారు పట్టరాని ఆనందంతో అక్కడే సందడి చేశారు. తమకు షాపు దక్కిందంటూ విజయకేతనం ఎగురవేశారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

సిండికేట్లకు చుక్కలు..

జిల్లావ్యాప్తంగా కాకినాడనుంచి పదుల సంఖ్యలో సిండికేట్లు మద్యం షాపులకు దరఖాస్తులు చేశాయి. ఒక్కో సిండికేట్‌లో ఐదుగురు వ్యాపారులు 45 నుంచి 60 షాపుల వరకు దరఖాస్తులు చేశారు. వీరిలో లాటరీలో రెండు నుంచి మూడే దుకాణాలు వరించాయి. దీంతో పెట్టుబడి పోయినట్లయింది. నగరంలో ఓ భారీ సిండికేట్ జిల్లావ్యాప్తంగా 63 దుకాణాలకు దరఖాస్తు చేసింది. తీరా లాటరీలో జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో 11 మద్యం దుకాణాలు వీరికి దక్కాయి. బార్లు నిర్వహిస్తున్న కొందరు వ్యాపారులు 100దుకాణాలకు దరఖాస్తులు చేయగా నాలుగు షాపులు చిక్కాయి.

ఎన్ఆర్ఐలకు రెండు షాపులు

లాటరీ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల కొందరు మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేశారు. సామర్లకోటలో కూటమి అనుచరులు 69మందిగా కలిసిపోయి సిండికేట్‌గా ఏర్పడ్డారు. తీరా వీరికి మూడే షాపులు రావడంతో లబోదిబోమన్నారు. వైసీపీ అనుచరులు 13మంది కలిసి దరఖాస్తు చేసినా ఒక్కటీ దక్కక నిరాశపడ్డారు. దీంతో వీరికి రూ.26లక్షలు పోయి నట్లయింది. జిల్లాలో ఏడు ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా ప్రధానంగా ప్రత్తిపాడు, తాళ్లరేవు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మద్యం దుకాణాలకు అత్యధికంగా పోటీ నెలకొంది. ఇక్కడ ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా 30మంది వరకు పోటీపడ్డారు. మరోపక్క అమెరికానుంచి ఆరుగురు ఎన్ఆర్ఐలు తునిలో దుకాణాలకు దరఖాస్తు చేశారు. ఇందులో లాటరీలో రెండుషాపులు దక్కాయి. ప్రత్తిపాడు సర్కిల్‌లో 15 దుకాణాలకుగాను 13 పురుషులకే దక్కాయి. జిల్లాలో టీడీపీ, వైసీపీకి చెందిన పలువురు పెద్దనేతలు జిల్లాలో పది నుంచి ఇరవై షాపుల వరకు దరఖాస్తు చేయగా రెండు నుంచి మూడు షాపులు దక్కాయి. కాకినాడ నగరంలో మొత్తం 36 షాపులకు లాటరీ నిర్వహించగా ఒకే వ్యక్తికి రెండు షాపులు లాటరీలో వచ్చాయి.

బుధవారం నుంచే విక్రయాలు

లాటరీలో దుకాణాలు దక్కించుకున్న వారంతా బుధవారం నుంచి మద్యం విక్రయాలకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు దుకాణాల్లో సరుకు దించుకోవాలని ఎక్సైజ్‌శాఖ అధికారులు అన్నారు. జిల్లాలో 155 షాపులకుగాను 148 మద్యం దుకాణాలకు రూ.65లక్షల చొప్పున, మిగిలిన దుకాణాలకు రూ.55లక్షల చొప్పున దుకాణాలు దక్కించుకున్న వారు ప్రభుత్వానికి ఆరు విడతల కింద లైసెన్సు ఫీజు చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తొలి వాయిదా కింద దుకాణాలు సొంతం చేసుకున్న యజమానులు సోమవారం మధ్యాహ్నం రూ.16.68కోట్లు ప్రభుత్వానికి చెల్లించారు. లైసెన్సు 2026 వరకు వీరికి దక్కనుంది. తద్వారా మొత్తం వాయిదాల కింద జిల్లానుంచి ప్రభుత్వానికి రూ.200కోట్ల వరకు ఆదాయం రానుంది.

ఇవేం కౌంటర్లు బాబోయ్..

లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారినుంచి ఎక్సైజ్ అధికారులు తొలివిడత వాయిదా డబ్బులను సోమవారం మధ్యాహ్నం నుంచి చెల్లింపులు చేసుకున్నారు. ఇందుకు ఎస్‌బీఐ మూడు కౌంటర్లను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసింది. 155మంది అభ్యర్థులు ఒక్కొక్కరూ

మిగతా 8వ పేజీలో...

వీధికుక్కల సంతానోత్పత్తి నివారణకు శస్త్రచికిత్సలు

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు(ఆంధ్రజ్యోతి)14: జిల్లాలో అన్ని మున్సిపాలిటీల్లో వీధి కుక్కల సంఖ్యను తగ్గించే చర్యల్లో భాగంగా వీధి కుక్కల్లో సంతానోత్పత్తిని నివారించేందుకు శస్త్రచికిత్సలు చేయించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపాలిటీల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధికుక్కలతో తరచూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలకు రాష్ట్ర ప్రభుత్వం స్నేహ ఏజెన్సీని ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వీధి కుక్కల సంఖ్యను తగ్గించేందుకు సంతానోత్పత్తిని నివారించేందుకు శస్త్రచికిత్స చేయిస్తామన్నారు. ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం తొలి దశలో కాకినాడ జిల్లాలో కాకినాడ పట్టణం, తుని, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, ఏలేశ్వరం మున్సిపాలిటీల్లో ఐదువేల వీధి కుక్కలకు సంతానోత్పత్తి నివారించేందుకు ప్రణాళిక ప్రకారం శస్త్రచికిత్సలు చేయించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కాకినాడ నగర పాలకసంస్థ కమిషనర్ భావన, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, డీడీ కృష్ణమూర్తి, గిరీష్, స్నేహ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిఠాపురం పురపాలక సంఘంలో త్రిసభ్య కమిటీ విచారణ 7

సరస్వతీ దేవి విగ్రహం ధ్వంసం 7

- ప్రత్తిపాడు మండలం లంపకలోవ హైస్కూల్లో దుండగుల దుశ్చర్య

అల్పపీడనంతో కలవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రైతుల్లో కలవరం మొదలైంది. వరి పంట కీలకమైన చిరుపొట్ట, పొట్ట, ఈనిక దశలో ఉంది. ఈ తరుణంలో వర్షాలు పడితే గింజ పొల్లుపోయే ప్రమాదం ఉంది. అదే సమయంలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన పంటలు స్థానంలో వేసిన కాయగూరలు, ఇతర మెట్ట పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకూ కురిసిన భారీవర్షంతో రైతుల్లో ఆందోళన మరింతగా పెరిగింది.

- చిరుపొట్ట, పొట్ట, ఈనిక దశలో వరి పంట
- భారీ వర్షం పడితే గింజ పొల్లుపోయే ప్రమాదం
- మెట్ట పంటలకు నష్టం వాటిల్లే అవకాశం
- ఇప్పటికే భారీ వర్షంతో ఆందోళన



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య చిరుపొట్ట, పొట్టదశలో ఉన్న వరి పంట

పిఠాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అన్నిరకాల పంటలకు కీలకమైన సమయంలో బంగాళాఖాతం మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం అల్పపీడనం ఏర్పడి భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ హెచ్చరికలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరువారాల క్రితం కురిసిన అతిభారీవర్షాలు, ఆపై ఏలేరు, సుద్దగడ్డలకు సంభవించిన భారీ వరదలతో వరి సహా పత్తి, కాయగూరలు, ఇతర మెట్టలకు అపారనష్టం వాటిల్లింది. పలుచోట్ల పంట పూర్తిగా కుళ్లిపోయింది. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతోపాటు ఏలేరు పరివాహక ప్రాంతంలో పలుచోట్ల 50శాతంపైగా పంటను రైతులు కోల్పోయారు. మిగిలిన పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఎరువులు వేసి తెగుళ్లు ఆశించకుండా పురుగుమందులు పిచికారీ చేశారు. దీంతో వరిపొలాలు ఇప్పుడిప్పుడే పచ్చనిరంగు సంతరించుకున్నాయి. వరదలు, వర్షాల ప్రభావంతో దిగుబడులు సగానికిపైగా తగ్గినా జరిగిన నష్టాన్ని ఎంతో కొంతో పూడ్చుకోవచ్చుననే భావనతో రైతులు పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆ వరి పంట చిరుపొట్ట, పొట్టదశలో ఉంది. కొన్నిచోట్ల ఈనిక దశకు చేరింది. ఈ సమయంలో భారీవర్షాలు పడితే వరి కంకులో గింజ సరిగా గట్టిపడకుండా పొల్లుబారి పోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే దాని ప్రభావం దిగుబడులపై పడుతుంది. పొల్లు అధికంగా ఉంటే రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు ముందుకు రారు.

ఇప్పుడిప్పుడే మొక్క దశను దాటి...

భారీవర్షాలు, వరదల కారణంగా కాయగూరల పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. పిఠాపురం, గొల్లప్రోలుతోపాటు మెట్ట మండలాల్లో వేసిన ఈ పంటలను రైతులు నష్టపోయారు. రైతులు ఆ పంటను తొలగించి మళ్లీ విత్తనాలు వేశారు. ఇప్పుడిప్పుడే అవి మొక్క దశను దాటుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తే దిగుబడులు బాగా వస్తాయని, ధరలు ఆశాజనంగా ఉన్న నేపథ్యంలో జరిగిన నష్టాన్ని పూడ్చుకుని కొంత మేర లాభాలను వెనుకేసుకోగలమని రైతులు భావించారు. ఇప్పుడు మళ్లీ వర్షాలు కురిస్తే కాయగూరల పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

పత్తిది అదే పరిస్థితి

వరదల నుంచి పత్తి పంట తేరుకుంది. వారం గడిస్తే మొదటి విడత పత్తి రైతుల చేతికి రావడం ప్రారంభమవుతుంది. ఈ తరుణంలో వర్షాలు కురిస్తే కాయలు నుంచి విడిచిన పత్తి తడిచిపోతోంది. తడిసిన పత్తి నాణ్యత దెబ్బతింటే బయ్యర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపరు. రేటు కూడా 50శాతానికి పైగా తగ్గిస్తారని రైతులు కలవరానికి గురవుతున్నారు. ఆలస్యంగా వేసిన చోట పత్తి కాయలు వర్షానికి పగిలిపోతాయి. దీనివల్ల మొదటి విడత వచ్చే పత్తిని రైతులు నష్టపోతారు. పూతదశలో ఉన్న పంటపై పూత రాలిపోతుంది. మరోవైపు మెట్ట మండలాల్లో రైతులు మిర్చి పంట వేశారు. వర్షాలవల్ల ఈ పంట దెబ్బతినే అవకాశం ఉంది.

ఉరుములు, మెరుపులతో భారీవర్షం

అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. ఉదయం వరకూ వర్షం కొనసాగింది. ఉరుములు, మెరుపుతో కురిసిన వర్షంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రారంభంలోనే ఇలా ఉంటే అల్పపీడనం బలపడితే మరింత ఎక్కువగా వర్షాలు పడతాయని వారు కలవరపడుతున్నారు. ఇదే జరిగితే ఏలేరు రిజర్వాయర్‌లో నీరు నిండి మళ్లీ వరద జలాలు దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. ఇప్పటికే గత నెలలో సంభవించిన వరదల కారణంగా ఏలేరు కాలువల గట్లు ఛిద్రమయ్యాయి. పలుచోట్ల కోతకు గురయ్యాయి. గండ్లు అక్కడక్కడా మాత్రమే పూడ్చారు. పలుచోట్ల ఇంకా పనులే ప్రారంభం కాలేదు. ఈతరుణంలో వరదలు వస్తే ముంపు ప్రభావం ఎక్కువగా ఉండి నష్టం అధికంగా ఉంటుందని వారు ఆందోళన చెందుతున్నారు.

స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లోస్..

ఏలేరు రిజర్వాయర్‌లోకి ఇన్‌ఫ్లోస్ స్వల్పంగా పెరిగాయి. ప్రస్తుతం క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2256 క్యూసెక్కుల నీరు వస్తుండగా, దిగువకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏలేరు కాలువలకు వేయి క్యూసెక్కులు, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, విశాఖ తాగునీటి అవసరాలకు 200 క్యూసెక్కులను పంపుతున్నారు. ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.66మీటర్లు ఉండగా నీటినిల్వలు 22.28 టీఎంసీలు ఉన్నాయి. రిజర్వాయర్‌లో గరిష్ఠంగా 86.56 మీటర్ల వరకూ 24.11 టీఎంసీల నీటిని నిల్వ ఉంచే అవకాశం ఉంది. ఇప్పుడు వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటినిల్వలు గరిష్ఠస్థాయికి త్వరితగతిన చేరే అవకాశం ఉంది. అదే జరిగితే వరద జలాలను దిగువకు విడుదల చేయాల్సి ఉంటుంది. మరోవైపు సుద్దగడ్డలో నీటి ప్రవాహం పెరుగుతోంది. అల్పపీడన ప్రభావం తక్కువగా ఉంటే పంటలకు నష్టం జరగకుండా ఉంటుందని, ఎక్కువగా ఉంటే పంటలకు మరోమారు నష్టం తప్పదని రైతులు అంటున్నారు.

అధికారులూ అప్రమత్తంగా ఉండండి

- భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికారులతో కమిషనర్ భావన



కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తుపాను ప్రభావంవల్ల భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. తుపాను నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం మంత్రి మున్సిపల్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు సూచనలు చేశారు. అల్పపీడన ప్రభావంతో ఈనెల 14 నుంచి మూడురోజులపాటు జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో కాకినాడ నగర పరిధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషనర్ భావన ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలపై దృష్టిసారించాలని సూచించారు. ముంపునకు గురయ్యే ప్రాంతాలవారిని అప్రమత్తం చేయాలని తెలిపారు. వర్షపునీరు బయటకు పోయే మార్గాలను పూర్తిగా శుభ్రం చేసి నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. వరదనీటిని తొలగించడానికి సహాయక చర్యల కోసం ఎక్సకవేటర్లు, ట్రాక్టర్లను సిద్ధం చేసుకోవాలన్నారు.

సమస్యలు స్థానికంగా పరిష్కరించండి: ఎస్పీ విక్రాంత్‌పాటిల్

- ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లావ్యాప్తంగా 50మంది అర్జీదారులు హాజరు

కాకినాడ క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు స్థానికంగా వారి సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 50మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి సాధ్యమైనంత త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్బీ డీఎస్పీ సీహెచ్ శ్రీరామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



అర్జీదారులనుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్



ఉప్పాడ తీరంలో మత్స్యకారుని వలకు పెద్ద మండ పీత చిక్కింది. కిలో బరువున్న మండపీతను రూ.900కు తీరప్రాంతానికి చెందిన వ్యక్తే కొనుగోలు చేయడం విశేషం. - కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)



లిక్కర్ దుకాణాల డ్రాలో ఈసారి మహిళలు ఎక్కువగానే పాల్గొన్నారని తేలింది. చివరకు డ్రాలో గెలిచిన వారిలోనూ తామేమీ తక్కువ కాదన్నట్టు షాపులు దక్కించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 16 మంది మహిళలు మద్యం షాపులు దక్కించుకోగా, కాకినాడ జిల్లాలో ఆరుగురు దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో ఐదు షాపులు దక్కించుకున్నారు.

పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంట!



పెళ్లంటే ఇది వరకు ఉన్న సంప్రదాయం వేరు. ఇప్పుడు వేరు. పూర్వం ఐదు రోజుల పెళ్లిళ్లు జరిగేవని పెద్దలు చెబుతుంటే వినేవాళ్లం. తర్వాత ఒక రోజు పెళ్లి తంతు వరకూ వచ్చేసింది. కానీ ఇప్పుడు మళ్లీ ట్రెండ్ మారింది. పెళ్లి పేరుతో ఐదు రోజులేంటి. డబ్బుంటే వారం రోజులూ ఒకటే హడావుడే. సామాన్య కుటుంబాలు సైతం లక్షల్లో వివాహ వేడుకల కోసం ఖర్చు పెట్టేస్తున్నారు. మధ్యతరగతి వారు ఉన్నత వర్గాలతో పోటీపడుతున్నారు. ధనవంతులైతే ఓ చిన్న సినిమా బడ్జెట్‌తో సమానంగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లి పిలుపుల నుంచి వివాహ వేదికల వరకు, ప్రీ వెడ్డింగ్ షూట్ల దగ్గర మొదలైన సందడి ముహూర్తం రోజు దాకా ఒక్క తంతు కాదు జరిగేది.. సంగీత్, మెహందీ, బ్యాచిలర్ పార్టీల దాకా వేల నుంచి లక్షల దాకా ఖర్చే ఖర్చు. ఇక వివాహం రోజు.. వివాహ వేదిక, విద్యుత్, పూల అలంకరణలు, విందు భోజనాలు, అతిథుల బస, రిటన్ గిఫ్టల పేరుతో చేసే వ్యయం పెళ్లి బడ్జెట్‌ను అంచనాలకు మించిపోతోంది. మా పిల్లల పెళ్లి.. ఆడంబరంగా చేసుకోకపోతే ఎలా అని కొందరు సంబరపడుతుంటే, వివాహ తంతు పూర్తయ్యాక బడ్జెట్ లెక్కలేసుకుని లబోదిబోముంటున్న వారెందరో.. అందుకే పెళ్లంటే.. బడ్జెట్ ఎంతంటున్నారు ప్రతి ఒక్కరూ.. మరి మీ బడ్జెట్ ఎంతేంటి..

- మొదలైన పెళ్లిళ్ల సందడి.. ఈ మూడు నెలలూ ముహూర్తాల పంట.. అన్ని వ్యాపారాలకూ జోష్
- వివాహాల పేరిట లక్షల్లో వ్యయం.. పరపతి చాటుకునే వివాహ వేడుకలు.. విందు భోజనాలు
- రంగంలోకి మ్యారేజ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్లు.. సొమ్ములిస్తే చాలు అన్నీ సిద్ధం చేసేస్తామంటూ రెడీ

పెళ్లిళ్లే.. పెళ్లిళ్లు..

పచ్చని పందిళ్లు.. విద్యుత్ దీపాలంకరణలతో ఏ వీధికి వెళ్లినా పెళ్లి సందడే. వరుసగా మూడు నెలలపాటు పెళ్లి ముహూర్తాలు రావడంతో ఓవైపు పురోహితులు, మరోవైపు ఫొటో, వీడియోగ్రాఫర్లు, కేటరింగ్ పనివారలకు చేతినిండా పనే. ఏ ఇంట చూసినా ఇప్పటికే నాలుగైదు శుభలేఖలు పెళ్లిళ్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. పెళ్లిళ్ల సీజన్ జోరందుకోవడంతో ఓవైపు బంగారు నగల వ్యాపారం మరోవైపు వస్త్ర వ్యాపారాలతోపాటు అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. కల్యాణ మండపాలకు యమ డిమాండు ఏర్పడింది. ముహూర్తాలు పెట్టుకున్న సమయంలోనే ముందుగా కల్యాణ మండపాలను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలపాటు ఉన్న పెళ్లి ముహూర్తాల గురించి బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వర రావు సిద్ధాంతి వివరించారు. ప్రస్తుత ఆశ్వయుజ మాసమైన అక్టోబరులో ఈ నెల 16న సాయంత్రం 6.52 గంటలకు, రాత్రి 12.06 గంటలకు, 17న రాత్రి 8.16 గంటలకు, 20న రాత్రి 10.54 గంటలు, 26న రాత్రి 10.30 గంటలకు, 27న ఉదయం 7.58 గంటలకు పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాసం. నవంబరు 3వ తేదీ రాత్రి 7.08 గంటలకు, 9.58 గంటలకు, 6న ఉదయం 7.18 గంటలు, 9న రాత్రి 6.45 గంటలకు, 10న ఉదయం 7.03 గంటలకు, 13న ఉదయం 6.52 గంటలకు, 14వ తేదీ ఉదయం 6.48 గంటలకు, రాత్రి 6.26 గంటలకు, 22న రాత్రి 8.44 గంటలకు, తెల్లవారుజామున 5.20 గంటలకు పెళ్లి ముహూర్తాలున్నాయి. డిసెంబరు 2 నుంచి 30వ తేదీ వరకు మార్గశిరమాసమని, డిసెంబరు 4న రాత్రి 7.57 గంటలు, 5న తెల్లవారుజామున 4.29 గంటలకు, 6న తెల్లవారుజామున 4.25 గంటలకు, 7న రాత్రి 7.45 గంటలకు, తెల్లవారుజామున 4.21గంటలకు, 10న తెల్లవారుజామున 4.09 గంటలకు, 11న తెల్లవారుజామున 4.06 గంటలకు, 20న రాత్రి 3.31 గంటలకు, 25న తెల్లవారుజామున 4.08 గంటలకు పెళ్లి ముహూర్తాలు ఉన్నట్టు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

- అమలాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)





పూల పందిరిలో...

మీరు నిండు మనస్సుతో వచ్చి మూడుముళ్ల బంధంతో పచ్చని పందిరిలో ఒకటి కాబోతున్న జంటకు మీ చల్లని చేతులతో అక్షింతలు వేసి దీవించి మనసారా ఆశీర్వదించండి.. ఒకప్పుడు శుభలేఖలో అతిథులకు పలికే స్వాగత పలుకులు ఇలా ఉండేవి.. ఆరోజు వచ్చిన బంధుమిత్రులకు ఎదురేగి స్వాగతం పలికి పచ్చని పందిట్లో మేళతాళాల మధ్య వేద మంత్రాల సాక్షిగా ఒక్కటయ్యే నవ దంపతులకు ఆశీర్వచనాలు పొందడం, అరిటాకులో విందు భోజనం ఆరగించి వీడ్కోలు తీసుకోవడం జరిగేది. ఇప్పుడు పెళ్లంటే.. సాదాసీదా కాదు, పచ్చని పందిట్లో సందడిగా సాగిపోయే తంతు కాదు.. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్టు హోదాకు తగినట్టు, తమ స్తోమతను చాటుకునేలా అంగరంగ వైభవంగా వివాహాలు జరిగిపోతున్నాయి. వేలల్లో ఖర్చుతో జరిగే పెళ్లిళ్లు లక్షల్లో వ్యయమవుతున్నాయి. ధనికుల ఇళ్లల్లో అయితే కోట్లలో ఖర్చు పెట్టేస్తున్నారు. ఆహ్వాన పత్రిక మొదలుకొని పెళ్లికి బంగారం, ఖరీదైన పట్టు చీరలు, వచ్చిన అతిథులకు ఆహా ఏమిరుచి అన్నట్టు ఎన్నెన్నో వంటకాలతో విందు భోజనాలు, వివాహానికి ఖరీదైన వేదికలు, అద్భుతమైన సెట్టింగులు, పూలతోటల మాదిరిగా అలంకరణలు.. వీటన్నింటిని కెమెరాలో బంధించేలా వీడియో, ఫొటోగ్రఫీ. పెళ్లికి ముందు ప్రీ వెడ్డింగ్ షూట్లు.. ఒక సినిమా తీసినంత అట్టహాసంగా షూటింగ్.. చెప్పాలంటే పెళ్లంటే ఇవాళ ఒక భారీ బడ్జెట్ సినిమా. గతంలో ఐదు రోజుల పెళ్లిళ్లు జరిగేవి. తర్వాత మూడు రోజులకు, తర్వాత ఒక రోజుకి చేరాయి. ఇప్పుడు పెళ్లికి ముందు, తర్వాత కలిపి కనీసం ఐదు రోజులకు తగ్గకుండానే ఒక్కొక్క వివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది వరకు ఓ మాదిరి పెళ్లంటే ఒక లక్ష లేదా రెండు లక్షల ఖర్చు. ఇప్పుడు సామాన్యులైతే రెండు మూడు లక్షలు.. మధ్యతరగతి అయితే కనీసం పది లక్షలు.. కాస్త కలిగిన వారైతే ఇరవై.. ధనికులైతే రూ.40 లక్షల నుంచి కోటి వరకు అవుతోందని మ్యారేజ్ ఈవెంట్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇది వరకు బంధువులే కాస్త ముందు వచ్చి పెళ్లి ఏర్పాట్లు చూసేవారు. ఇప్పుడు మ్యారేజ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ అంటూ ఒక వ్యవస్థే వచ్చి కూర్చుంది. బడ్జెట్‌ను బట్టి పెళ్లి.. ఎంత ఘనమైతే అంత ధర. దీంతో అబ్బా ఫలానా పెళ్లికి వెళ్లాం.. ఏముందిరా మండపం.. ఏ మున్నాయిరా భోజనాలు.. ఎవరికి ఆర్డర్ ఇచ్చారంటావు? చాలా బాగున్నాయిరా.. అని పెళ్లికి వచ్చిన వారి చర్చోపచర్చలు. ఈ కామెంట్ కోసం లక్షలు ఖర్చు పెట్టామని పెళ్లివారూ జబ్బలు చరుచుకోవడం చూస్తూనే ఉన్నాం. కానీ ఈ ఘనమైన పెళ్లిళ్ల సందడిలో మధ్యతరగతి వారూ పరుగులు పెట్టి ఆనక లబోదిబోమనడం కూడా చూస్తున్నాం.

'మహా' విందులు..

వివాహాది శుభకార్యాలకు వధూవరుల కుటుంబాలు ఏర్పాటుచేస్తున్న విందులు ఆహా.. భోజనంబు అన్న రీతిలో అబ్బురపరుస్తున్నాయి. వివాహం ఎంత డెకొరేటివ్‌గా చేశామన్నది ప్రధానమైతే, ఎంత ఘనంగా భోజనాలు పెట్టామన్నది మరో ముఖ్యమైన విషయమైంది. అసలే గోదావరి జిల్లాలు.. భోజనాల్లో 'స్పెషాలిటీ' ఉండనే ఉంటుంది. దానికి తోడు ఎన్ని వెరైటీలు భోజనం మెనూలో ఉన్నాయనేది ఈమధ్య స్టేటస్‌కు సింబల్‌గా మారింది. దానికోసం ఖర్చుకు వెనుకాడడం లేదు. విందు భోజనాల్లో పది నుంచి 20 రకాలపైబడి ఆహార పదార్థాలు విస్తరిలో వడ్డిస్తారు. విజిటేబుల్ బిర్యాని, ఫ్రైడ్‌రైజ్, జీరా రైస్, వాము రైస్, కొరియాండర్ రైస్, టమాటోరైస్, లెమన్ రైస్, కోకోనట్ రైస్, పులిహోరా, వైట్ రైస్ మొదలెడితే అర డజను రకాల కూరలు, ఫ్రై, రసం, సాంబారు, పులుసులు ఇలా ఓ పది అయిటమ్స్ అన్నా వేసేస్తున్నారు. స్వీట్లు, ఐస్ క్రీమ్స్, పాన్‌లు వంటివి ప్రత్యేక కౌంటర్‌లే ఏర్పాటుచేస్తున్నారు. స్వీట్లు కూడా పూత రేకులు మొదలుకొని తాపేశ్వరం కాజా వరకు సుమారు ఐదు నుంచి పాతిక రకాల స్వీట్లను అందుబాటులో ఉంచుతున్నారు. భోజనాలతోపాటు అల్పాహారాలను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. మినపరొట్టెలు, పొట్టిక్కలు, చిట్టి గారెలు, ఇండ్లీ సాంబరు, ఉప్మా పెసరట్టు, మినీ పూరీలు, ఉల్లిబజ్జిలు అవో డజను రకాలు.. వేడివేడిగా తయారుచేసి వడ్డించే ఏర్పాట్లు చేస్తున్నారు. విందు భోజనాలకు లక్ష నుంచి మూడు లక్షలు వరకు సామాన్య, మధ్యతరగతి వారు, ఉన్నత వర్గాల వారు పాతిక లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. క్యాటరింగ్ సంస్థలు ప్లేటుకు రూ.300 నుంచి రూ.2 వేల దాకా విందు భోజనాలకు చార్జి చేస్తున్నారంటే భోజన బడ్జెట్ ఎంతో మీరే లెక్కలేసుకోండి.

- రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి)



మండపం ఖర్చు 10 లక్షల దాకా..

పెళ్లి మండపం ఖర్చు అక్షరాలా 10 లక్షలు పైమాటే అంటే ఆశ్చర్యపోతున్నారా.. ఇది నిజం. ఖరీదైన ఇలాంటి మండపం తయారీకి పూలు ఊటీ, కేరళ ప్రాంతాల నుంచి తీసుకొస్తారు. ఈ మండపాన్ని పెళ్లికి 4 నుంచి 6 రోజుల ముందు నుంచే తయారుచేయడంలో పూలడెకరేటర్లు నిమగ్నమై ఉంటారు. ఇందుకు బెంగళూరు నుంచి కార్నిషియా, ఆర్కిడ్స్, విలియమ్స్, హెల్కోనియా, బ్లూడైజ్, సాంగ్ ఆఫ్ ఇండియా, డ్రసేనియా, క్రిసాంతిమం, స్నోబాల్ తదితర ఖరీదైన అందమైన పూలను తీసుకువస్తారు. వివాహానికి హాజరయ్యే బంధువులు వచ్చే కల్యాణమండపం ద్వారం నుంచి పూలతో అలంకరణ మొదలవుతుంది. ప్రస్తుతం పెళ్లికుమార్తె మంగళ స్నానంతో ఇచ్చే పూల నుంచి పెళ్లి మండపం, మొదటిరాత్రి గది అలంకరణ వరకు మొత్తం పూలు, మండపం వరకు తామే అలంకరణ చేసే విధంగా ఆర్డర్లు వస్తున్నాయని డెకరేటర్లు చెబుతున్నారు. వేదికను బట్టి యాభై వేల నుంచి పదిహేను లక్షల దాకా పూల డెకరేషన్ ఖర్చు అవుతుందని చెబుతున్నారు. - కడియం (ఆంధ్రజ్యోతి)



పెళ్లంటే తప్పెట్లు తాళాలు కాదు.. వీడియో షూట్లు.. ఫొటో సెషన్స్

పెళ్లిళ్లు అనగానే వేద మంత్రాలు, బాజాభజంత్రీలతో చేసే సందడి ఒక్కటే కనిపించేది.. ఇప్పుడు పెళ్లి అంటే పూర్తిగా ఫొటో, వీడియో షూట్లు. అదృష్టం బాగుంటే అప్పుడప్పుడూ పెళ్లి సందడి మనకు కనిపిస్తే వీక్షించి ఆనందించొచ్చు. జీలకర్ర బెల్లం వేళో, సూత్రధారణ సమయంలోనో నాలుగు అక్షితలు వేయడానికి క్యూ లైన్లలో నుంచి వధూవరుల వద్దకు వెళ్లినా పక్కకు జరగండనో, ఫొటోకు ఫోజువ్వమనో ఆర్డర్లు వినిపిస్తాయి. పెళ్లి జీవితంలో మరపురాని మధురానుభూతి. దాన్ని పదికాలాలు దాచుకునేలా ఫొటోలు, వీడియోలు తీయించుకోవడమూ సబబే. కానీ పెళ్లికి ముందు ప్రివెడ్డింగ్ షూట్లు, మెగా ఈవెంట్ మాదిరి పెళ్లి వేడుకల రికార్డింగ్ హడావుడి మధ్య పెళ్లి తంతు ముగుస్తోంది. దీనికి కూడా లక్ష నుంచి పది లక్షలపైనే వసూలు చేసే ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు, ఫొటోగ్రాఫర్లు ఉన్నారంటే ఆశ్చర్యపోనవసరం లేదు.





డాగ్ 'షో'

కుమార్తెకు ప్రేమతో..

చైనా నుంచి కాకినాడకు..

సింహాన్ని తలపిస్తున్న చౌచౌ

విశ్వాసానికి మారుపేరుగా శునకాలు నిలుస్తాయి. పలువురు వారి ఆర్థిక పరిస్థితులను బట్టి లక్షలు వెచ్చించి శునకాలను దేశ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఇళ్లల్లో పెంచుకుంటున్నారు. కాకినాడకు చెందిన మాజీ కార్పొరేటర్ కోరుమిల్లి బాలప్రసాద్ లక్షలు విలువ చేసే జాగిలాన్ని చైనా నుంచి కొనుగోలు చేసి తన కుమార్తెకు బహుమతిగా అందించారు. చూసేందుకు సింహాన్ని తలపిస్తున్న ఈ జాగిలం చౌచౌగా పిలిచే చైనాకు చెందింది. గంభీరంగా కనిపిస్తున్న వీటి ధర కూడా అదే స్థాయిలో లక్షల్లో ఉంటుంది. ఇంటి కాపలాలో దీనికి ఇదే సాటి. 8 నుంచి 12 ఏళ్ల జీవితకాలం ఉన్న ఈ జాతి శునకాలు చలి ప్రదేశాల్లో ఎక్కువగా జీవిస్తాయి. వీటి నాలుక నీలి రంగులో ఉంటుంది. అయిదేళ్ల కిందట తన కుమార్తె పదో తరగతి పాసైనందుకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు బెంగుళూరు, ఢిల్లీ నుంచి రూ.2.40 లక్షలు వెచ్చించి రెండు శునకాలు కొనుగోలు చేశారు. ఇవి చూడ్డానికి సింహాల్లా ఉండడం విశేషం.



- కాకినాడ కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

నేడు గ్రామీణ మహిళా దినోత్సవం..





దుమ్మిరి భీమమ్మ రచించిన కోయ పద్యం కిల్లోర్‌కె.. కోయబాల సాహిత్య రచయిత్రి దుమ్మిరి భీమమ్మ

నాటి నిరక్షరాస్యురాలే.. నేటి రచయిత్రి!

స్ఫూర్తిగా నిలిచిన ఆదివాసీ మహిళ దుమ్మిరి భీమమ్మ

భావితరాలకు కోయబాల' సాహిత్యం

అదే ఆమె లక్ష్యం

దుమ్మిరి భీమమ్మ... ఓ ఆదివాసీ మహిళ. ఎనిమిది మంది సంతానంలో ఆరవది. ఇపుడామె వయసు 51 ఏళ్లు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన భీమమ్మను చదివించే ఉద్దేశం తల్లిదండ్రులకు లేదు. అంటే అంతటి స్తోమత లేదన్నమాట. అయితే తమ్ముడు బడికి వెళ్లనంటూ మారాం చేస్తుండడంతో తమ్ముడికి తోడుగా భీమమ్మను తల్లిదండ్రులు బడికి పంపించేవారు. అట్లా భీమమ్మ తన తమ్ముడితోపాటే ఐదో తరగతి వరకు చదువుకుంది. ఆ తర్వాత తమ్ముడు బడికి సవ్యంగా వెళ్లడం అలవాటుపడ్డాడు. దీంతో భీమమ్మను ఆమె తల్లిదండ్రులు ఇంటి పనులకే పరిమితం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం రామన్నపాలేనికి చెందిన భీమమ్మ తనకు చదువుపై ఆసక్తి ఉన్నా చేసేదేమీ లేక మిన్నకుండిపోయింది. చివరకు వ్యవసాయ పనుల్లో భాగమైంది.

● ఇరవై మూడేళ్లకు మళ్లీ చదువు

హైదరాబాద్‌కు చెందిన ఓ ఎన్జీవో సంస్థ చింతూరు మండలం చట్టిలో చదువురాని యువతీ, యువకులను సమీకరించి వారితో ఏడో తరగతి పరీక్షలు రాయించడం మొదలుపెట్టింది. వారందరికీ భోజన వసతి కూడా కల్పించారు. విషయం తెలుసుకున్న భీమమ్మ వారిని ఆశ్రయించింది. ఈ క్రమంలో ఆమె ఏడో తరగతి పాసైంది. తోటి వారంతా పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతామని ఎన్జీవో నిర్వాహకులకు చెప్పుకున్నారు. అయితే తమ ప్రాజెక్టు పూర్తయిందని వారు నిష్క్రమించారు. దీంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

● సొంతంగా ఆశ్రమ పాఠశాల

ఎన్జీవో తరఫున అప్పటివరకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు గంగదేవి యాదయ్య, పాండు కాంబ్లెకర్.. భీమమ్మలాంటి పలువురు విద్యార్థుల తపన చూసి ఏదో చేయాలన్న ఆలోచనకొచ్చారు. భీమమ్మ లాంటివారు 55 మంది పోగయ్యారు. వారంతా కలిసి రామన్నపాలెంలో తలోకొంత సొమ్ము జమ చేసుకుని అటవీ కలపతో ఒక ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేసుకున్నారు. తమకు వేతనాలొద్దంటూ యాదయ్య, పాండు వారితో పాటే ఆశ్రమ పాఠశాలలో ఉంటూ పాఠాలు చెప్పారు. భీమమ్మ పదో తరగతి కూడా పాసైంది. అక్కడితో ఆగని ఆమె ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఏ పూర్తి చేసింది.



భీమమ్మ రచించిన కోయ పద్యం మిడికోస్

● కోయబాల సాహిత్యంపై మక్కువ

అంచెలంచెలుగా కోయత్తోర్ బాట (ఆదివాసీల దారి) ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించింది. అదే దశలో భీమమ్మ సాహిత్యంపై మక్కువ పెంచుకుంది. కాలక్రమంలో తమ ఆదివాసీ భాష కనుమరుగైపోతున్న తీరుని ఆమె పసిగట్టింది. సంప్రదాయాలు, ఆచారాలకు పుట్టినిల్లుగా ఉన్న కోయభాషను ఆదివాసీ భావితరాలకు అందించాలన్న తపన భీమమ్మలో మొదలైంది. దీంతో ఆమె కోయ సాహిత్యంపై దృష్టి సారించింది. అదే తన లక్ష్యంగా మలచుకుంది. అందుకు యాదయ్య, పాండు కూడా సహకారమందించారు. దీంతో కోయబాల సాహిత్యంపై భీమమ్మ అడుగులు వేగంగా పడుతున్నాయి. ఇపుడామె కలం నుంచి పలు కథలు, పద్యాలు, పాఠాలు రూపుదిద్దుకుంటున్నాయి. అవన్నీ కోయ భాషలోనే.

● ప్రతి చప్పుడూ ఓ కథే

ప్రతి జీవరాశి నుంచి వెలువడే శబ్దం ఆమె కోయ బాల సాహిత్యంలో పద్యం, పాటగా రూపుదిద్దుకుంటున్నాయి. కిల్లోర్‌కె, మిడికోస్... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో గిరిజన సాహిత్య రచనలకు ఆమె శ్రీకారం చుట్టింది. చివరకు మొన్నటి నిరక్షరాస్యురాలు నేడు సాహిత్య రచయితగా పలువురి ప్రశంసలు, మన్ననలు సొంతం చేసుకుంటోంది. - చింతూరు (ఆంధ్రజ్యోతి)



కోయబాల సాహిత్య కార్యశాలలో భీమమ్మను సన్మానిస్తున్న ఆదివాసీ మహిళలు (పాత చిత్రం)

పట్టుదలతో.. పరిశ్రమ

ప్రభుత్వ ప్రోత్సాహంతో రాణిస్తున్న వివాహిత

ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తగా అడుగులు





రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియాలో ప్లాస్టిక్ బాటిల్స్ తయారీ.. పక్కన మందపల్లి ధనలక్ష్మి

కాకినాడ జిల్లాలో ఎంఎస్ఎంఈ ద్వారా లబ్ధిపొందిన పారిశ్రామికవేత్తలు సుమారు 13 వేల మంది ఉన్నారు. ఇందులో మహిళా పారిశ్రామికవేత్తలు 3800 వరకు ఉన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో స్వయం ఉపాధి పొందుతూ పలువురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కాకినాడ రూరల్ మండలంలోని రమణయ్యపేట గ్రామం బాపన్నదొర కాలనీకి చెందిన మందపల్లి ధనలక్ష్మి ఇందులో ఒకరు. ఈమె డిగ్రీ పూర్తి చేసి ఎంబీఏ చదువుతున్నారు. ఈమె భర్త నవీన్ డ్రైవర్. ఇద్దరు పిల్లలు. భర్త సంపాదనకు తోడుగా తాను ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలవాలని భావించి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ తయారీలో రెండేళ్లపాటు పనిచేసి ధనలక్ష్మి నైపుణ్యం సాధించింది. సొంతంగా పరిశ్రమ ఏర్పాటుచేయాలన్న ఆలోచనతో జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉన్న పథకాలపై సమాచారాన్ని సేకరించింది. జిల్లా పరిశ్రమలశాఖ అధికారుల వద్దకెళ్లి సొంతంగా ప్లాస్టిక్ బాట్లింగ్ తయారీ యూనిట్ నెలకొల్పాలన్న ఆకాంక్షను వ్యక్తం చేసింది. 2023లో డీపీఆర్ తయారుచేసి పీఎంఈజీపీ పథకంలో యూనిట్ మంజూరు కోసం దరఖాస్తు చేసుకుంది. యూనిట్ ఖరీదు రూ.35 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో రూ.12 లక్షల రాయితీగా, లబ్ధిదారుని వాటా సొమ్ము 5 శాతం చెల్లించి 2024 ఫిబ్రవరిలో రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్లాస్టిక్ బాట్లింగ్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. పలువురు మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ స్వయం ఉపాధి పొందుతూ ఆమె ఇతరులకు మార్గదర్శకంగా నిలిచారు. సొంతంగా పరిశ్రమ ఏర్పాటుచేయాలన్న కోరిక, నైపుణ్యం ఉంటే యూనిట్లు మంజూరుకు పరిశ్రమల శాఖ అధికారులు సిద్ధంగా ఉన్నారని ధనలక్ష్మి తెలిపారు.

- సర్పవరం జంక్షన్(ఆంధ్రజ్యోతి)

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు

కరప విద్యార్థిని యస్మిత నాగమహి ఎంపిక



కరప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కాకినాడ జిల్లా కరప విద్యార్థిని ఎంపికైంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న బి.యస్మిత నాగమహి బాలికల జూనియర్ అండర్-17 కేటగిరీలో నేషనల్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16 నుంచి తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగే బాలికల సౌత్‌జోన్ ఖేలో ఇండియా మ్యాచ్‌కు రాష్ట్రం తరపున ఈమె ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి గ్రామానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. యస్మిత నాగమహిని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పీఎంసీ చైర్మన్ దేవు దుర్గారావు, హెచ్ఎం, పీడీలు కె.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, సీహెచ్ కృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తీక మాసం రద్దీ నేపథ్యంలో

రత్నగిరిపై క్యూలైన్లు, వ్రత మండపాల పరిశీలన

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1న ప్రారంభమయ్యే కార్తీక మాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తులకు సౌకర్యాల కల్పన, లోటుపాట్లపై ఈవో రామచంద్రమోహన్ సోమవారం పరిశీలించారు. ముందుగా క్యూ లైన్లు, వ్రత మండపాలను చూశారు. ఒక్కో మండపంలో ఎంతమంది భక్తులు వ్రతమాచరించుకునే వీలుందో ఆరా తీశారు. మండపాల లోపలి భాగంలో ఏర్పాటు చేసిన నూతన క్యూలైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ, పోలీసు, మిగిలిన శాఖల అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించేందుకు మినిట్స్ సిద్ధం చేయాలని సూచించారు.



రాజరాజేశ్వరీదేవిని దర్శించుకుంటున్న కమిషనరు సత్యనారాయణ దంపతులు

పాదగయలో దేవదాయ శాఖ కమిషనరు పూజలు

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ సతీసమేతంగా సోమవారం సాయంత్రం సందర్శించారు. కుక్కుటేశ్వర స్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మ వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించారు. కమిషనరు దంపతులను దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనరు రమేష్‌బాబు, ఆలయ సూపరింటెండెంట్ వీరభద్రరావు శేష వస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. శిష్టికరణాల వీధిలోని పురుహూతికా అమ్మవారిని



దర్శించుకున్నారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను దర్శించుకున్నారు. కమిషనరు దంపతులకు కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.





ధ్వంసమైన సరస్వతీ దేవి విగ్రహం, తొలగించిన దిమ్మ

సరస్వతీ దేవి విగ్రహం ధ్వంసం

లంపకలోవ హైస్కూల్లో దుండగుల దుశ్చర్య

పోలీసులు రంగప్రవేశం... క్లూస్ టీమ్ పరిశీలన... హైందవ సంఘాల ఆగ్రహం

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ జడ్పీ హైస్కూలులోని సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. హైస్కూలు ప్రాంగణంలో దశాబ్దం క్రితం అప్పటి వార్డెన్ ఎం.మధుసూదనరావు సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా అప్పటి విద్యా కమిటీ చైర్మన్ సిగిరెడ్డి భక్తాంజనేయ ఆవిష్కరించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని దిమ్మ నుంచి వేరుచేసి దారుణంగా ధ్వంసం చేశారు. దసరా సెలవులు ముగిసి సోమవారం స్కూలు వచ్చిన వెంటనే విగ్రహాన్ని చూసిన వాచ్‌మెన్, ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడు కేవీ రాఘవకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్ఎం ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీకాంతం, సిబ్బంది వచ్చి పరిశీలించారు. కాకినాడ నుంచి వచ్చిన క్లూస్ టీమ్ విగ్రహ ధ్వంస పరిసరాల్లో దుండగుల ఆధారాల లభ్యం కోసం పరిశీలించింది. సరస్వతీ దేవి విగ్రహ ధ్వంసంపై మండలంలోని హైందవ సంఘాలు, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

పిఠాపురం పురపాలక సంఘంలో

త్రిసభ్య కమిటీ విచారణ

కాకినాడ జిల్లా పిఠాపురం పురపాలక సంఘంలో కమిషనరు, డీఈఈ మధ్య జరిగిన వాగ్వాదంపై అమరావతి నుంచి వచ్చిన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులు సోమవారం విచారణ చేపట్టారు. మునిసిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల నుంచి వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. ఇద్దరు అధికారులనూ మార్చాలని పలువురు కౌన్సిలర్లు కోరారు.

కమిషనరు, డీఈఈ వివాదంపై వివరాల సేకరణ .... ఇద్దరు అధికారులనూ మార్చాలని కౌన్సిలర్ల వినతి

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆగస్టు 31వ తేదీన కమిషనరు కనకారావు, డీఈఈ భవానీప్రసాద్ కౌన్సిల్ సభ్యుల సాక్షిగా వాగ్వివాదానికి దిగి ఒకరిని ఒకరు తోసుకోవడంతో పాటు కొట్టుకున్నారు. అందరూ తలదించుకునే విధంగా బూతులు తిట్టుకున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ కోసం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పి.పూర్ణచంద్రరావు, పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఎం.బ్రహ్మాజీ, టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టరు బి.శ్రీనివాసులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు సోమవారం పిఠాపురం పురపాలక సంఘానికి వచ్చి కౌన్సిల్ సమావేశంలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. పుర-పరిపాలన శాఖ ప్రాంతీయ డైరెక్టరు నాగనరసింహరావుతో పాటు ఆగస్టు 31న కౌన్సిల్ సమావేశానికి హాజరైన పలువురు కౌన్సిలర్లు, మునిసిపల్ వైస్ చైర్మన్-2 కొత్తపల్లి పద్మ, అధికారులు, సిబ్బంది నుంచి ఆ రోజు జరిగిన ఘటనపై వివరాలు సేకరించి వారి స్టేట్‌మెంట్లు నమోదు చేసుకున్నారు. కమిషనరు, డీఈఈ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. సదరు ఘర్షణలో డీఈఈని సస్పెండ్ చేసి కమిషనరుపై చర్యలు తీసుకోకపోవడాన్ని కౌన్సిలర్లు తప్పుపట్టారు. డీఈఈ ఉండగా ఎటువంటి లిఖితపూర్వక ఉత్తర్వులు లేకుండా మరొక డీఈఈతో అనధికారికంగా ఎలా పనిచేయించుకుంటారని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించిన ఏడుగురు ఉద్యోగుల నియమకాలు రద్దు చేయమని తాము తీర్మానం చేశామని, కాని వారికి జీతాలు చెల్లించారని తెలిపారు. కమిషనరు వ్యవహారశైలిపై పలు ఆరోపణలు చేశారు. అందరినీ కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, ఉద్యోగులను దుర్భాషలాడుతున్నారని లిఖితపూర్వకంగా తెలిపారు. ఆనాటి సమావేశంలో ఏమి జరిగిందో తాము గతంలోనే మునిసిపల్ ఆర్డీకి తెలియజేసినా ఏకపక్షంగా ఒకరిపై మాత్రమే చర్యలు తీసుకున్నారని చెప్పారు. కమిషనరుపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కమిషనరు, డీఈఈలను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని పలువురు కౌన్సిలర్లు విచారణాధికారులను కోరారు. సమర్థులైన అధికారులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

తాము తిరస్కరిస్తే ఆమోదించినట్టు రాశారు...

ఆగస్టు 31న జరిగిన కౌన్సిల్ సమావేశం అజెండాలో ర్యాటిఫికేషన్‌లకు సంబంధించి 22 అంశాలను తాము రద్దు చేశామని, వాటిపై కౌన్సిలర్లతో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానం చేశామని కౌన్సిలర్లు తెలిపారు. అయితే మినిట్స్‌లో మాత్రం ఈ 22 అంశాలను ఆమోదించినట్టు రాశారని చెప్పారు. కౌన్సిల్ తిరస్కరించిన విషయాలను ఆమోదించినట్టు రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని, వాటిని తిరస్కరించినట్టు నమోదు చేయాలని అధికారులను కోరారు. కాగా తాము అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ల నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశామని, కమిషనరు, డీఈఈని విచారించామని, నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరు పూర్ణచంద్రరావు చెప్పారు.



కౌన్సిలర్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న త్రిసభ్య కమిటీ సభ్యులైన మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి బాలుడి మృతి

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



చరణ్ శ్రీతేజ (పాత చిత్రం), విచారణ నిర్వహిస్తున్న ఎస్డీపీవో రఘువీర్ విష్ణు, సీఐ పెద్దిరాజు



సర్పవరం జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తూ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... కాకినాడ ఎల్‌బీ నగర్ ఐదో వీధిలో రైస్‌మిల్లు ఎదురుగా గల రేకుల షెడ్డులో కుక్కల మల్లేశ్వరరావు భార్య, కుమారుడు చరణ్ శ్రీతేజ (13) కలిసి ఉంటున్నాడు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చరణ్ శ్రీతేజ అశోక్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి సమీపంలో ఉన్న రాజేశ్వరి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లోకి ఆడుకునేందుకు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే అపార్ట్‌మెంట్ నుంచి కింద పడి మృతి చెందాడు. విషయం తెలిసిన సర్పవరం ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు, కాకినాడ ఎస్డీపీవో రఘువీర్ విష్ణు సంఘటనాస్థలానికి చేరుకుని బాలుడు మృతదేహాన్ని పరిశీలించారు. అపార్ట్‌మెంట్ వాసులు, వాచ్‌మెన్‌ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ కుమారుడిని ఎవరో పై నుంచి తోసేయడంతోనే మృతి చెంది ఉంటాడని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. అక్కడే ఉన్న సీసీ ఫుటేజీలో చరణ్ శ్రీతేజ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లడాన్ని పోలీసులు పరిశీలించారు. బాలుడి బాబాయి వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించినట్టు తెలిపారు. కాగా ఇదే రూటులో వెళ్తున్న కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌ను మృతుని బంధువులు ఆపి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తక్షణం విచారణ నిర్వహించాలని ఎంపీ పోలీసులను ఆదేశించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



సంఘటనా స్థలంలో మృతి చెందిన అనిల్

మినీ లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎటపాక, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారిపై గన్నవరం గ్రామ శివారులో సోమవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం రుద్రంకోట గ్రామానికి చెందిన గాదే అనిల్ (37) భద్రాచలంలోని ఓ ఫెర్టిలైజర్ షాపులో పని చేస్తున్నాడు. ఫీల్డ్ వర్కులో భాగంగా ద్విచక్ర వాహనంపై కూనవరం వెళ్లి తిరిగి భద్రాచలం వెళ్తున్నాడు. భద్రాచలం వైపు నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో వస్తున్న మినీ లారీ బైక్‌ను ఢీకొట్టింది. అనిల్ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగింది. కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. మినీ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వేదమూర్తి, వీరబ్రహ్మం మృతదేహాలు

కోటిపల్లి గోదావరిలో గల్లంతైన యువకులు మృతి

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద ఆదివారం స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు యువకులు మృతి చెందారు. రామచంద్రపురం మండలం రావిచెరువుకు చెందిన నరాల వేదమూర్తి, మేడిశెట్టి వీరబ్రహ్మం శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని కోటిపల్లి వద్ద గోదావరి నదిలో నిమజ్జనం చేయడానికి గ్రామస్తులతో కలిసి వచ్చారు. నిమజ్జనం అనంతరం స్నానానికి దిగి గోదావరి లోతు తెలియక నీటిలో మునిగిపోయారు. స్థానికులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. రాత్రిదాకా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన సమీప ప్రాంతాల్లో సోమవారం వారు విగతజీవులుగా తేలారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ ఎస్కే జానీబాషా చెప్పారు.

పెళ్లి చేస్తానన్నారని మనస్తాపం

తల్లి ఒంటరి అవుతుందని పురుగుల మందు తాగిన యువతి

చికిత్స పొందుతూ పోస్ట్ ఉమన్ మృతి



సురేఖ (పాత చిత్రం)

ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసి నిన్ను అత్తవారింటికి పంపిస్తానని తల్లి చెప్పడంతో మనస్తాపానికి గురైన యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన సురేఖ (23) పేరవరంలో పోస్టు ఉమన్‌గా ఉద్యోగం చేస్తోంది. ఆమెకు తండ్రి లేరు. తల్లి వివాహం చేస్తానని చెప్పడంతో మనస్తాపానికి గురైంది. తనకు వివాహం చేస్తే అత్తవారింటికి వెళ్లిపోతానని, తల్లి ఒంటరిగా ఉంటుందని కలత చెందిన సురేఖ గత నెల 30వ తేదీన పేరవరం పోస్టాఫీసు వద్ద పురుగుల మందు తాగింది. స్థానికులు ఆమెను రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ పెద్దిరాజు తెలిపారు.

34 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్య అప్పారావు

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం సి.రాయవరం గ్రామ సమీపాన ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 34 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. తమిళనాడుకు చెందిన పుగాజ్‌హేంది (23) చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బు సంపాదించడానికి గంజాయిని మార్గంగా ఎంచుకున్నాడు. అక్రమంగా రవాణా చేస్తూ ఏలేరు కాలువ పరిధిలో పోలీసులకు పట్టుబడ్డాడు. 34 కిలోల గంజాయిని 16 ప్యాకెట్లు చేసి మోటారు సైకిలుపై తరలిస్తుండగా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారని సీఐ చెప్పారు. పుగాజ్‌హేందిపై కేసు నమోదు చేశారు. సీఐ, ఏలేశ్వరం ఎస్ఐ రామలింగేశ్వరరావు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



బోల్తా పడిన ఆటోలోంచి మహిళలను కాపాడి సపర్యలు చేస్తున్న దృశ్యం

ఆటో బోల్తా: ముగ్గురు మహిళలకు గాయాలు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-కాకినాడ ప్రధాన రహదారిలో మాధవపట్నం వంతెన సమీపంలో 12 మందితో కాకినాడ వెళ్తున్న గోతిలో పడి అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవరు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో పాటు అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అటుగా వెళ్తునన వారు ప్రయాణికులను రక్షించి చికిత్స నిమిత్తం కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తలుపులమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు పూజలు

తుని రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు సోమవారం విచ్చేశారు. ఆయనకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం రఘురామ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించగా ఈవో పి.విశ్వనాథరాజు మహా ప్రసాదం అందజేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు కావ్య

అప్పు తీర్చమంటే... వైసీపీ నాయకుడు దాడి చేశాడు

నాపై కేసు పెట్టమని మాజీ ఎంపీ భరత్ అనడం న్యాయమా: యాంకర్ కావ్యశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నాపై వైసీపీ నాయకుడు ఎన్వీ శ్రీనివాస్ దాడి చేస్తే తిరిగి నాపైనే కేసుపెట్టమని మాజీ ఎంపీ భరత్‌రామ్ అనడం ఎంతవరకు న్యాయమని యాంకర్ కావ్యశ్రీ ప్రశ్నించారు. సోమవారం ఆమె తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్‌లో తెలుగు మహిళా నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుడు శ్రీనివాస్ తనయుడు అభిలాష్‌కు తాను మూడేళ్ల కిందట రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చానని, అప్పట్నుంచీ 30 సార్లకు పైగా అడిగానన్నారు. ప్రతిసారీ వీడియో రికార్డింగ్ చేశానన్నారు. ఆ సొమ్మును తిరిగి అడిగినందుకు దాడి చేశారన్నారు. అప్పు విషయమై గతంలో ఎంపీ భరత్‌రామ్‌కు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు నాపై దాడి జరిగితే తిరిగి నాపైనే కేసుపెట్టమని అదే భరత్ చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. శ్రీనివాస్‌ను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని హోం మంత్రి అనితను కోరతామన్నారు. తెలుగు మహిళా నేతలు మాలే విజయలక్ష్మి, కోసూరి చండీప్రియ మాట్లాడుతూ వైసీపీ నాయకులంతా ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో వుండి అహంతో వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలపై దాడులను కూటమి ప్రభుత్వం సహించదన్నారు. బాధిత మహిళకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు బోసు ఈశ్వరి, శ్రీలత, లక్ష్మి పాల్గొన్నారు.

సికింద్రాబాద్-కాకినాడ మధ్య నేడు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగకు తమ స్వగ్రామాలకు వెళ్లి తిరిగి తమ గమ్యస్థానాలకు తిరిగివెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే అధికారులు మంగళవారం సికింద్రాబాద్-కాకినాడ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడుపుతున్నట్టు సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యేక సమాచారం జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 6.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరే ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇందులో ఒక ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీ, ఏసీ టూటైర్, త్రీటైర్, ఏసీ స్లీపర్, సెకండ్ క్లాస్, జనరల్ బోగీలు ఉంటాయి.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



వీరాస్వామి (పాత చిత్రం)

కరప, అక్టోబరు 14: కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పిడుగు పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన నందికొండ వీరాస్వామి (35) భార్యతో కలిసి కాజులూరు మండలం ఉప్పుమిల్లిలో ఐదేళ్లుగా నివాసముంటున్నాడు. పశువులను మేపుకుంటూ, తాపీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం వేకువజామున వర్షం పడుతుండడంతో పశువులను పాకలో కట్టేందుకు పొలానికి వెళ్లాడు. అక్కడ పిడుగుపాటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మరణించాడు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. వీరాస్వామి మృతితో స్థానికంగా విషాదం చోటుచేసుకుంది. స్థానిక వీఆర్వో ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. గొల్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరాస్వామి మృతితో జీవనాధారం కోల్పోయిన అతడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు, బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటో బోల్తా: ఆరుగురికి గాయాలు

కొవ్వూరు, అక్టోబరు 14: తూర్పు గోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన కైరా జయశ్రీ మరో ఐదుగురు విద్యార్థులు కొవ్వూరు జూనియర్ కళాశాలకు ఆటోలో బయల్దేరారు. గామన్ బ్రిడ్జి సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. గాయాలపాలైన వారిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు పట్టణ హెచ్‌సీ ఎం.సత్యనారాయణ తెలిపారు.

‘పల్లె పండుగ’తో రోడ్లకు మహర్దశ

ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, కూటమి నాయకులు

కొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆగస్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో తీసుకున్న తీర్మానాలకు అనుగుణంగా పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉప్పాడ శివారు కొత్తమయాపట్నంలో రూ.1.52 కోట్ల వ్యయంతో నిర్మించే సిమ్మెంటురోడ్లకు సోమవారం వారు శంకుస్థాపన చేశారు. ఈనెల 14నుంచి 20వ తేదీవరకు చేపట్టే పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా మండలంలో రూ.3కోట్ల వ్యయంతో రోడ్లను నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథక నిధులతో చేపట్టే రోడ్లనాణ్యతను ప్రజలు పర్యవేక్షించాలని సూచించారు. జనసేన వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మత్స్యకార నాయకులు గంటా విజయకుమార్, సూరాడరాజు, మేరుగు భూషణం పాల్గొన్నారు.



ఉప్పాడ శివారు కొత్తమయాపట్నంలో సీసీరోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న కూటమి ప్రజాప్రతినిధులు

నగరంలో ప్రయాణం.. నరకమే!

నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులకు ఇబ్బందులు

షాపింగ్ మాల్స్‌లో పార్కింగ్ స్థలం లేకపోయినా పట్టించుకోని అధికారులు



నిత్యం రద్దీగా ఉంటున్న కాకినాడ మెయిన్ రోడ్డు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ప్రధాన నగరం కాకినాడ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా అనేక మంది ప్రజలు వస్తూ పోతూ ఉంటారు. నగర జనాభా కూడా క్రమంగా పెరగడంతో నగరంలో ప్రయాణమంటే నరకంగా మారింది. జనాభా పెరిగినంతగా నగర విస్తీర్ణం పెరగకపోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎ క్కువవుతోంది. నగరంలో ప్రధానంగా మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు, దేవాలయంవీధి రోడ్డు ప్రధాన రహదారులు కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లొచ్చే వారితోపాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చే వాహనాలతో నగరంలో ఈ ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతోంది. పెరుగుతున్న జనాభా దృష్ట్యా అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నగరంలోని ప్రధాన రహదారులు మూడు తీసుకుంటే షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు, గోల్డ్ షాప్స్ వంటి వ్యాపారులు వినియోగదారులకు పార్కింగ్ చేసుకోవడానికి సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారం వారి వాహనాలను పార్కింగ్ చేయడంతో ఈ ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుంది. ఏదైనా ప్ర మాదం జరిగినప్పుడో లేక ఎవరైనా ముఖ్యమైన వారు వచ్చినప్పుడో తప్ప సంబంధిత అధికారులు ఎవరూ ఈ ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. భానుగుడి జంక్షన్ నుంచి జగన్నాథపురం వంతెనకు వెళ్లాలంటే కనీసం 10 నిమిషాలు పడుతుంది. కానీ ట్రాఫిక్ జామ్ అధికంగా ఉండడంతో 30 నిమిషాలు పడుతుందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

‘లాటరీ’ కొట్టేశారు!

ఐదోపేజీ తరువాయి...

రూ.10లక్షల నుంచి రూ.11 లక్షల వరకు ఫీజులు రూపేణా చెల్లించడానికి నానా ఇబ్బందులు పడ్డారు. అంత మొత్తం తీసుకోవడానికి బ్యాంకు చుక్కలు చూపించింది. దీంతో కొందరు కాకినాడ మెయిన్‌రోడ్డులో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లారు. అక్కడ కూడా అంత డబ్బు తీసుకునేది లేదని చెప్పడంతో మళ్లీ కలెక్టరేట్‌లో కౌంటర్ల వద్దకే వచ్చి నిరాశగా వేచిచూశారు. ఫలితంగా ఫీజులు కౌంటర్లలో జమ చేసే క్రతువు రాత్రి వరకు కొనసాగింది.

సామర్లకోటలో భారీ వర్షం



సామర్లకోట రైల్వే స్టేషన్లో లీకుల కారణంగా ప్లాట్‌ఫాంపై వర్షం నీరు

సామర్లకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణం, మండలంలోనూ సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. ఉదయం నుంచీ ఉక్కబోత వాతావరణంతో సతమతమైన ప్రజలు రాత్రి కురిసిన వర్షంతో చల్లగాలుల కారణంగా ఉపశమనం పొందారు. ఉరుములు, మెరుపులతో పిడుగుల పడడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల లక్షలాది నిధులు వెచ్చించి కాలువలలో పూడిక తొలగింపులు నిర్వహించినప్పటికీ పట్టణానికి ముంపు బెడద తప్పలేదని పలువురు వాపోయారు. రైల్వే స్టేషన్లోని 3 ప్లాట్‌ఫాంలపై షెడ్‌ల నుంచి వర్షం నీరు లీకుల కారణంగా ప్రయాణికుల తడిసిముద్దయ్యారు. అసలే ప్లాట్‌ఫాంపై అపారిశుధ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రయాణికులు ఆకస్మికంగా కురిసిన భారీవర్షానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నాగులాపల్లిలో అగ్నిప్రమాదం

మేక, 8 కోళ్లు అగ్నికి ఆహుతి



మంటల్లో కాలిబూడిదైన కోళ్లు

కొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నాగులాపల్లి గొల్లపేటలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి తాటాకిల్లు దగ్ధమైన సంఘటనలో మేక, కోళ్లు బూడిదయ్యాయి. రూ.2లక్షల నష్టం వాటిల్లినట్టు సమాచారం. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపేటలో తాటాకిల్లులో అదే గ్రామానికి చెందిన గింజాల వెంకట్రావు, అతడి కుమార్తె అల్లుడు కలిసి మేకలు, కోళ్లు పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అర్ధరాత్రి అగ్నిప్రమా దం కారణంగా వారు నిరాశ్రయులయ్యారు. ఇంటి పక్కనే ఉన్న దొడ్డిలో ఉన్న మేక, గంపలో మూతపెట్టిన 8కోళ్లు ప్రమాదంలో పూర్తి గా కాలిపోయాయి. సంఘటనా స్థలాన్ని వీఆర్వో, సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి పరిశీలించారు.

పేదలకు భోజనం, బియ్యం అందజేత

తాళ్లరేవు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యండమూరి గ్రామానికి చెందిన వైష్ణవి, వాత్సల్య పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఉచిత భోజనం, బియ్యం తదితరులను సూరంపూడి కుమార్ ఆధ్వర్యంలో సోమవారం తాళ్లరేవులో అందజేశారు. తాళ్లరేవు లయన్స్ క్లబ్ సహకారంతో రోజు పేదలకు అందించే ఉచిత భోజనంలో భాగంగా అభాగ్యులకు భోజనం, పండ్లు, ఇతర సామాగ్రిని అందించారు.



తాళ్లరేవులో బియ్యం అందజేస్తున్న దృశ్యం

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు

స్నానాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు పనులను సోమవారం ప్రారంభించారు. నీటిని పూర్తిగా తొలగించి ఆరబెట్టిన తర్వాత మళ్లీ కొత్త నీరు పెట్టనున్నారు. మహాలయ పక్షోత్సవాలు, అమావాస్య సమయంలో ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి వాటిని పాదగయ పుష్కరిణిలో కలిపారు. దీంతో నీరు కలుషితమయింది. ఈ నేపథ్యంలో మహాలయ అమావాస్య ముగిసిన తర్వాత నీటిని తొలగించారు. అయితే విజయదశమి పర్వదిన సమయంలో పాదగయ పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించాల్సి రావడంతో హడావుడిగా నీరు పెట్టారు. పుష్కరిణిని పూర్తిస్థాయిలో శుభ్రం చేయకుండా నీరు పెట్టడం వల్ల రంగుమారింది. ఈ నేపథ్యంలో దసరా శరన్నవ రాత్రులు ముగియగానే పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగించడం ప్రారంభించారు. ఇందు నిమిత్తం మోటార్లు ఏర్పాటు చేశారు. నీరు పూర్తిగా తొలగించి వారం రోజులు ఆరబెట్టిన తర్వాత కార్తీకమాసం ప్రారంభమయ్యే సమయానికి మళ్లీ నీరు పెట్టనున్నారు. కార్తీకమాసం నెల రోజులు పాటు వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. నీరు తొలగిస్తున్న నేపథ్యంలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనరు పి.విశ్వనాథరాజు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పల్లె పండుగకు ఏర్పాట్లు చేశాం

ఎంపీడీవో శ్రీనివాస్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలంలో ఈనెల 15 నుంచి 18 వరకు జరిగే పల్లె పండుగ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో పసుపులేటి శ్రీనివాస్ తెలిపారు. ఆగస్టు 22న జరిగిన గ్రామసభల్లో తీర్మానం చేసిన పలు అభివృద్ధి పనులకు ఎన్ఆర్ఈజీఏస్ నుంచి ప్రభుత్వం రూ.6.87 కోట్లు మంజూరు చేసిందన్నారు. మంగళవారం మధ్యాహ్నం నేమాంలో రూ.29.40 లక్షల నిధులతో 3 అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో భూమి పూజ చేయడం జరుగుతుందన్నారు. ఇదేరోజున వాకలపూడిలో 5 పనులకు రూ.79.50 లక్షలు, వలసపాకలలో 14 పనులకు రూ.కోటి నిధులు, రమణయ్యపేటలో 6 పనులకు 37.40 లక్షల నిధులతో రోడ్లు, డ్రైనేజీ తదితర నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. 16న పెనుమర్తి, పి.వెంకటాపురం, పండూరు, సూర్యారావుపేట, 17న సర్పవరం, తూరంగి, కొవ్వూరు, కొవ్వాడ, రేపూరు, 18న చీడిగ, గంగనాపల్లి, ఇంద్రపాలెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో భూమి పూజా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

‘19 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు’

పెద్దాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 19 వరకూ మండలంలోని పల్లెపండుగ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో డి.శ్రీలలిత తెలిపారు. 17వ తేదీన కాండ్రకోట, గోరింట, వడ్లమూరు, 18న జె.తిమ్మాపురం, ఆర్బీపట్నం, ఆనూరు, 19న చదలాడ, తిరుపతి, దివిలి గ్రామాల్లో ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. 15 పనులకు సంబంధించి పలు అభివృద్ధి పనులకు రూ.5.20 కోట్లు వెచ్చించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

‘4 రోజుల పాటు పల్లె పండుగ’

కరప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19వ తేదీ నుంచి 4 రోజుల పాటు నిర్వహించే పల్లెపండుగ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని ఎంపీడీవో మట్టపర్తి అనుపమ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో 59పనులు గుర్తించడం జరిగిందని, రూ.3.27కోట్ల ఉపాధి నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. 19న కరప, పెనుగుదురు, నడకుదురు, గురజనాపల్లి, ఉప్పలంక గ్రామాల్లోను, 20న కొరుపల్లి, జడ్.బావారం, గొడ్డటిపాలెం, వలసపాకల, వేములవాడ గ్రామాల్లోను, 21న వాకాడ, పెదకొత్తూరు, వేళంగి, యండమూరు, జి.బావారం, సిరిపురం గ్రామాల్లోను, 22న పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, కొంగోడు, గొర్రిపూడి, పాతర్లగడ్డ గ్రామాల్లోను పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించి నిర్దేశిత అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అధికారులు అందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బుద్ధ వందనాలు సమర్పణ

తాళ్లరేవు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు అంబేడ్కర్ భవనంలో బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పినిపే నాగేంద్రరావు ఆధ్వర్యంలో బౌద్ధధర్మ దీక్ష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంబేడ్కర్, గౌతమ బుద్ధుడి చిత్రపటాలకు ఉపాసకులు బుద్ధ వందనాలు సమర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ ఉపాసక నరసింహామూర్తి పాల్గొన్నారు.

నాసిరకం గుడ్లతో పట్టు రైతులకు నష్టం

గూళ్లు కట్టని పట్టు పురుగులు, పట్టించుకోని సెరీకల్చర్ రైతులు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గూళ్లు కట్టని పట్టు పురుగులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 14: నాసిరకం గుడ్లతో పట్టురైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు పంట కాలాలుగా రైతులకు ఈ విధంగా జరుగుతున్నా సెరీకల్చర్ అధికారులు మాత్రం తమకు పట్టనట్లు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు గురవుతున్నది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే అత్యధికంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు పరిసర గ్రామాల్లో పట్టు సాగు జరుగుతోంది. సాధారణంగా పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన మేలు రకం గుడ్లును పట్టుపరిశ్రమశాఖ ద్వారా రైతులకు అందించాలి. కొంత కాలంగా సెరీకల్చర్ అధికారులు ఆ బాధ్యతను విస్మరించారు. గుడ్లు ప్రవేటుగా కొనుగోలు చేసుకోవాలని చెబుతున్నారు. దీంతో రైతులు కర్నాటకలోని రామ్‌నగర్ తదితర ప్రాంతాలు నుంచి గుడ్లు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. గుడ్లు నుంచి పురుగులు వచ్చిన తర్వాత 40-45రోజుల వ్యవధిలో గూళ్లు కట్టాలి. పట్టుగూళ్లు కడితేనే అందులో నుంచి పట్టు వస్తుంది. అయితే రామ్‌నగర్ నుంచి తెచ్చిన గుడ్లు నుంచి పురుగులు అలాగే ఉండిపోతున్నాయి. ఒక్కొక్క పంటకు రైతులకు రూ.80వేలు వంతున పెట్టుబడి అవు తుంది. ఇప్పుడు దీనిని పూర్తిగా నష్టపోవడంతో పాటు పంటపై వచ్చే సుమారు రూ.2లక్షల ఆదాయాన్ని కోల్పోతున్నారు. సుమారు 30మంది రైతులు రెండు విడతలుగా నష్టపోయినట్లు చెబుతున్నారు. నెలరోజుల వ్యవధిలో 100 మందికి నష్టపోయినట్లు రైతులు తెలిపారు. తాము పట్టుపరిశ్రమశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారిలో కనీస స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

‘డయల్ యువర్ కమిషనర్’కు 14 సమస్యలు



వినతులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌కు 14మంది ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అదనపు కమిషనర్ నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా పలు సమస్యలపై 13 అర్జీలు అందాయి. డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాధిపతులు ఉన్నారు.

పేదలకు అవసరమైన మరిన్ని సేవలు చేయాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డాక్టర్ చప్పిడి

కాకినాడ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సమాజంలోని పేదలకు అవసరమైన మరిన్ని సేవలుచేయాలని అలయన్స్ ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. కాకినాడ కాస్మోపాలిటన్ క్లబ్‌లో అలియన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నూతన ఎంఎల్ఎఫ్ క్లబ్‌గా అలయన్స్ క్లబ్ పద్మారామ్ ప్రతిష్ఠాపన మహోత్సవానికి డాక్టర్ చప్పిడి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా గవర్నర్ వనుం శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమాన్ని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ అంతర్జాతీయ అధ్యక్షులు అల్లె వీఎం రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పి.శివకుమార్ అధ్యక్షుడిగా, టి.వీరభద్రరావు కార్యదర్శిగా, వరప్రసాద్ కోశాధికారిగా ఎంపిక కాగా చప్పిడి ప్రమాణస్వీకారం చేయించారు. సత్యనారాయణ, కిరణ్‌కుమార్, కృష్ణ, దుర్గాసుభద్ర, నాగేంద్ర, సుందరి, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



ఎమ్మెల్యే చినరాజప్పకు స్వామివారి చిత్రపటాన్ని అందచేస్తున్న అయ్యప్ప భక్త బృందం సభ్యులు

పెద్దాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో నడుచుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక బంగారమ్మ గుడి వద్ద 49 రోజులపాటు జరిగే మహాన్నదాన కార్యక్రమాన్ని ఆయన జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతీ ఒక్కరూ దైవ చింతనతో ఉండాలని, ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవడం అలవాటుచేసుకోవాలన్నారు. అనంతరం ఆయన చేతులమీదుగా మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గురుస్వామి వీరభద్రరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చినరాజప్ప, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

సామర్లకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం వల్లే నేడు రాష్ట్రంలో రహదారులకు ఈ దుస్థితి అధ్వాన ఏర్పడిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో 720 మీటర్ల పొడవునా సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చినరాజప్ప ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో కలిసి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. రోడ్డు నిర్మాణ పనులలో స్థానికులు దగ్గరుండి నాణ్యతా ప్రమాణాలు సరిచూసుకోవాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తుందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పల్లెపండుగ పేరిట రాష్ట్రంలో రహదారులన్నింటినీ అభివృద్ధి చేయడం వల్ల రవాణా సదుపాయాలు మెరుగవ్వగలవన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు తోటకూర శ్రీనివాస్, ఆకునూరి సత్తిబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్‌పై అత్యాచారానికి నిరసనగా ధర్నా



పిఠాపురంలో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ, రిక్షా కార్మిక సంఘం నాయకులు, సభ్యులు

పిఠాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మైనర్‌పై జరిగిన అత్యాచార సంఘటనకు నిరసనగా పట్టణంలోని ఉప్పాడ సెంటర్‌లో సీఐటీయూ, రిక్షా కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, బాలికకు మెరుగైన వైద్యం చేయించాలని, బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో నాయకులు కుంచే చిన్నా, పి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, సత్తిబాబు, వెంకట్రావు, రాజబాబు, లోవరాజు, రాజారావు, వీరబాబు, మణికంఠ, భవానీ, సూర్యనారాయణ ఉన్నారు.

‘బహిరంగ మద్యపానాన్ని అరికట్టాలి’

కాకినాడ క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో బహిరంగ మద్యపానాన్ని అరికట్టి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసంక్షేమ సంఘం కోరింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, గుడి, బడి, పార్కులు, రద్దీ కూడళ్ల ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్ని పౌరసంక్షేమ సంఘం సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరింది. నగరంలో ఇప్పటికే దుమ్ములపేట, సంజయ్‌నగర్, అన్నమ్మఘాటీ, శంతనపురికాలనీ, ఎస్.అచ్చుతాపురం, బ్యాంకోపేట, ముగ్గుపేట, జె.రామరావుపేట, కొత్తపేట మార్కెట్, అయోధ్యనగర్, పోర్ట్‌రోడ్డు, నాగరాజుపేట, ఏటిమొగ, యాళ్లవారుగరువు, పేరాజుపేట, కుంబాభిషేకం రేవు, హార్బర్‌జెట్టీ ప్రాంతాల వద్ద విచ్చలవిడిగా మద్యం లూజు విక్రయాలు నిత్యం జరుగుతున్నాయన్నారు. 359 సీసీ కెమెరాలు ఉన్నా కమాండింగ్ సెంటర్ నిర్వహణ లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు కోరారు.

‘జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి’

కాకినాడ క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్డు పెద్ద మసీదు వద్ద రహదారిపై జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని పౌరసంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ఈ విషయమై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కాకినాడ ఎమ్మెల్యే, ఎంపీలకు రిజిస్టర్డ్ లేఖలు పంపించామన్నారు. కలెక్టర్, ఎస్పీ నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రాలు సమర్పించామన్నారు. జాతీయ రహదారిగా ఉన్న మెయిన్ రోడ్డులో పడమర వైపునకు ఉన్న మసీదుకు తూర్పు వైపు నుంచి 90శాతం మంది ముస్లింలు నమాజ్‌కు వస్తారని, తీవ్రట్రాఫిక్‌లో సీనియర్ సిటిజన్స్ రోడ్డు దాటి వెళ్లడం ప్రమాదకరంగా ఉందన్నారు. ట్రాఫిక్ రూల్స్ ప్రకారం మసీదు వద్ద జీబ్రా క్రాసింగ్ మార్గం కల్పిస్తే వెసులుబాటు ఉంటుందన్నారు.

తూరంగేశ్వర స్వామి ఆదాయం లెక్కింపు

కాకినాడ రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వర స్వామి హుండీ ఆదాయాన్ని సోమవారం దేవదాయ ధర్మదాయ శాఖ తనిఖీదారుడు వి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో లెక్కించినట్టు ఈవో సీహెచ్ఎస్ఎన్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు, భక్తులు సమక్షంలో 2హుండీలను లెక్కించగా 7 నెలలకు మొత్తం రూ.1,35,076 ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నేడు కరప సర్వసభ్య సమావేశం

కరప, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక చంద్రన్న సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మట్టపర్తి అనుపమ తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తమ గ్రామాల్లోని ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



తాళ్లరేవు, అక్టోబరు 14: ప్రముఖ విద్యావేత్త, పౌరహక్కుల నేత ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబు మృతిపట్ల ప్రజాసంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం తాళ్లరేవులో ప్రజాసంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలతో ప్రజాసంఘాల నేతలు నివాళులు అర్పించారు. ప్రొఫెసర్ సాయిబాబా జీవితాశయం, కృషిని పలువురు వక్తలు వివరించారు. ప్రజాసంఘాల నేతలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

సీపీఎం కార్యదర్శిగా నాగు

పెద్దాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీపీఎం పెద్దాపురం మండలం రూరల్ ప్రాంతశాఖ కార్యదర్శిగా కేదారి నాగు ఎన్నికయ్యారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో శాఖ మహసభ ఎం.సత్తిబాబు అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. నాగును రూరల్ శాఖ కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నీలపాల సూరిబాబు, కరణం ప్రసాదరావు, మాగాపు నాగు, సత్తిబాబు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామి పాదకులు ఊరేగింపు



ధర్మవరంలో దత్తాత్రేయ పాదకులు ఊరేగిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 14: ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సోమవారం దత్తాత్రేయస్వామి పాదకులను ఊరేగించారు. పిఠాపురానికి చెందిన 14 మంది దత్తాత్రేయమాలధారణ భక్తులు రాష్ట్రంలోని 5 పంచారామాల దర్శనం కోసం చేపట్టిన పాదయాత్ర ధర్మవరం చేరుకుంది. స్థానిక భక్తులు ఘనస్వాగతం పలికి గ్రామ పురవీధుల్లో పాదకులను ఊరేగించారు. పిఠాపురం దత్తాత్రేయ పీఠానికి చెందిన భక్తులతో గ్రామానికి చెందిన దత్తాత్రేయ భక్తులు పాల్గొని రాచపల్లి రమణ ఆశ్రమం వరకు మాలధారణభక్తులను సాగనంపారు.

6వేల మందికి అన్నదానం

ధర్మవరం సత్తెమ్మ తల్లిఆలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం 6వేల మందికి అన్నదానం నిర్వహించారు. ధర్మవరం, ప్రత్తిపాడు, వెల్లుర్తి, వెన్నెహుడికి చెందిన భక్తులు ప్రసాదాలు స్వీకరించారు.

'లాటరీ' కొట్టేశారు!

ఐదోపేజీ తరువాయి...

రూ.10లక్షల నుంచి రూ.11లక్షలవరకు ఫీజులు రూపేణా చెల్లించడానికి నానా ఇబ్బందులుపడ్డారు. అంతమొత్తం తీసుకోవడానికి బ్యాంకు చుక్కలు చూపించింది. దీంతో కొందరు కాకినాడ మెయిన్‌రోడ్డులో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లారు. అక్కడ కూడా అంత డబ్బు తీసుకోబోమని చెప్పడంతో మళ్లీ కలెక్టరేట్‌లో కౌంటర్ల వద్దకే వచ్చి నిరాశగా వేచిచూశారు. ఫలితంగా ఫీజులు కౌంటర్లలో జమ చేసే క్రతువు రాత్రి వరకు కొనసాగింది.

ఏజెన్సీ సమాచారం

మద్యం షాపుల్లో టీడీపీ-వైసీపీ పొత్తులు

ముఖ్య నేతల నుంచి పంచాయతీ కేడర్ వరకు సిండికేట్లలో భాగస్వాములే!

మన్యంలో గ్రామసభల తీర్మానాల కోసం పరస్పర అవగాహనతో వ్యవహారాలు

రంపచోడవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కోసం రాజకీయాలకు అతీతంగా టీడీపీ, వైసీపీ నేతలు పొత్తులు కుదుర్చుకున్న వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ రెండు ప్రధాన పార్టీల్లో ముఖ్య నేతల స్థాయి నుంచి పంచాయతీ స్థాయి వరకు కేడర్ మద్యం సిండికేట్లలో భాగస్వాములయ్యారు. ఎమ్మెల్యేలు, వారి అనుచరులు, మాజీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు మాత్రమే కాకుండా అధికార, విపక్ష పార్టీలకు చెందిన వివిధ స్థాయిల నాయకులు పలువురు ఈ సిండికేట్లలో చేరిపోయారు. ఎవరు ఎన్ని షాపులకు సిద్ధంగా ఉన్నారో లెక్కలు రాసుకుని, వారందరూ సిండికేటుగా మారి ఎక్కువ స్థాయిలో షాపులకు దరఖాస్తు చేసుకుని ఎన్ని షాపులు వచ్చినా వాటిని కలిపి సిండికేట్‌గా మారి వ్యాపారాన్ని సాగించుకునేందుకు చొరవ చూపారు.

గిరిజన ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటుకు ఆయా పంచాయతీల నుంచి గ్రామసభల తీర్మానాలు తప్పనిసరి. ప్రస్తుతం టీడీపీ అధికారంలో ఉన్నా స్థానిక సంస్థలన్నీ దాదాపుగా వైసీపీ చేతుల్లోనే ఉన్నాయి. పంచాయతీల నుంచి అనుకూలంగా తీర్మానాలను తెచ్చే బాధ్యతను వైసీపీ నాయకులు, ప్రభుత్వం నుంచి ఎక్సైజ్, పోలీసు శాఖలను అనుకూలంగా మలచుకునే బాధ్యతను టీడీపీ నాయకులు భుజాన వేసుకున్నారు. పాడేరులో సోమవారం నిర్వహించిన లాటరీ అనంతరం పొత్తులు, పెట్టుబడులపై పూర్తిస్థాయిలో ఏకాభిప్రాయానికి వచ్చారు. సిండికేట్లలో ఆయా పెట్టుబడుల స్థాయిల మేరకు ఒప్పంద పత్రాలను కూడా సిద్ధం చేసుకుంటున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పల్లె పండుగలో ఎమ్మెల్యే శిరీషదేవి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం 'పల్లె పండుగ కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలోని ఇసుకపట్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులకు ఆమె భూమిపూజ చేశారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్‌దొర, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కారం సురేష్‌బాబు, టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, వై.నిరంజనీదేవి, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర్‌రెడ్డి, పాపోలు శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ మంగాయమ్మ పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 54 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రంపచోడవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 54 అర్జీలు అందాయని పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీ, ఐటీడీఏ ఏపీవో (జీ) డీఎన్‌వీ రమణతో కలిసి అర్జీలు స్వీకరించారు. తాడేపల్లి-సున్నంపాడు, బడిగుంట-అకూరు మెటల్ రోడ్డు, భూ సమస్యలు పరిష్కరించాలని, రంపచోడవరంలో వికలాంగులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని దరఖాస్తులు అందాయి. ఎస్‌డీసీ జాన్‌రాజ్, డిప్యూటీ డైరెక్టర్లు విజయశాంతి, షరీఫ్, ఏపీడీ దేగలయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, జీసీసీ డివిజనల్ మేనేజరు జి.పార్వతీశ్వరరావు, డాక్టరు వెంకట ఇందిర, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఈఈలు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు శాశ్వత హాస్టల్ భవనాలు ఏర్పాటు చేయాలి

దేవీపట్నం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని వివిధ కళాశాలల్లో చదువుకుంటున్న ఆదివాసీ విద్యార్థులకు అదనపు శాశ్వత హాస్టల్ భవనాలు మంజూరు చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలానికి ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆయన స్పందించి తక్షణం హాస్టల్ ఏర్పా టుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కారం రామన్నదొర, తెల్లం కామన్నదొర పాల్గొన్నారు.

దసరా క్రికెట్ టోర్నీ విజేత 'వై.రామవరం'



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న ఎస్ఐ రామకృష్ణ, వైద్యాధికారి రాహుల్

వై.రామవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వై.రామవరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో యూత్ కమిటీ సభ్యుడు గొర్లె నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా క్రికెట్ టోర్నమెంటులో వై.రామవరం జట్టు విజేతగా నిలిచింది. కె.యర్రగొండ జట్టును రన్నరప్‌గా ప్రకటించారు. విజేతలకు షీల్డ్, నగదు బహుమతిని ఎస్ఐ బి.రామకృష్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ అందజేశారు. క్రీడాకారులను వారు అభినందించారు. ముఖ్య అతిథిగా సాసం మాణిక్యం, గొర్లె శ్రీకాంత్, బత్తుల యోగేంద్రం తదితరులు పాల్గొన్నారు.





మోతుగూడెం మార్కెట్ సెంటర్లో వర్షం కురుస్తున్న దృశ్యం

మోతుగూడెంలో భారీ వర్షం

మోతుగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో సోమవారం సాయంత్రం ఆరు గంటల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మార్కెట్ సెంటరును వర్షపు ముంచెత్తడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు.

అమ్మవారి నిమజ్జనం



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

వరరామచంద్రాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వీఆర్ పురంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. సోమవారం అమ్మవారి విగ్రహాన్ని విద్యుద్దీపాలతో అలంకరిం చిన ట్రాక్టరుపై ఆశీనులు చేసి భజన, భక్తి పాటలు, చిన్నారుల నృత్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. పవిత్ర గోదావరిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

'పల్లె పండుగ'తో పంచాయతీలు ప్రగతి బాట

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



చినశంకర్లపూడిలో పల్లె పండుగ కార్యక్రమానికి తరలివస్తున్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

ప్రత్తిపాడు,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగతో పంచాయతీలు ప్రగతి బాట పట్టనున్నాయని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి గ్రామాల్లో రూ.40లక్షలతో నిర్మించే 4 సిమ్మెంటు రహదారులకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.10కోట్లు విలువ చేసే సిమ్మెంటు రహదారులు, రూ.5కోట్లు విలువ చేసే బీటీ రహదారులు నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్ములుగా నిలిచే పల్లెలు మరింత అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. వైసీపీ పాలనతో పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యమైందని, సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి పనులు చేపట్టలేక నిరుత్సాహంలో చతికిల పడ్డారని కూటమి ప్రభుత్వంలో పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు, ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రొంగల సత్యనారాయణ, సూర్నీడి నాగరత్నం, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, మిరియాల శ్రీను, తిరుపతి రావు, కూటమి నాయకులు కందా వీరాస్వామి, సింగిలిదేవ్ సత్తిరాజు, పిల్లా పద్మరాజు తదితరులు ఉన్నారు.

రౌతులపూడి: ఎన్డీయే పాలనలో అభివృద్ధి పరుగులు తీస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని దిగిశివాడ, గంగవరం, బలరామపురం గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ సోమరౌతు రవి, పైల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కామరాజుపేటలో...

జగ్గంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని గోకవరం మండలం కామరాజుపేటలో ఉపాధి హామీ పథ కం నిధులు రూ.70లక్షలతో నిర్మించనున్న 6 సీసీరోడ్లకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీని వాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన చేశారు. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఉన్నారు.



కామరాజుపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

అన్న క్యాంటీన్

జగ్గంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద దాతల సహకారంతో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం గండేపల్లి మండలం ఎన్టీరాజపురానికి చెందిన దివంగత పరిమి వీర్రాజు అన్నపూర్ణ దంపతుల కుమారుడు పరిమి నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన భోజనాలను జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేదలకు వడ్డించి ప్రారంభించారు. కోర్పు లచ్చయ్యదొర, పోతుల మోహన్‌రావు, పరిమి బాబు, చిట్టిబాబు ఉన్నారు.

'అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి'

కిర్లంపూడి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి సొసైటీ వద్ద సోమవారం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఎం.శ్రీరంగనాయకులు బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి రైతులు హాజరై సొసైటీలో అప్పు తీసుకోకపోయినప్పటికీ తలకు లక్ష రూపాయిలు చొప్పున వేసి వారికి నోటీసులు పంపించడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. అలాగే రూ.130 కోట్లు అవినీతి జరిగిందని రైతాంగం ఫిర్యాదు చేసిన ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు పలువురు రైతులు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి రంగనాయకులను సమావేశం జరగకుండా అడ్డుకున్నారు. జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి ఆ సొమ్ములు విచారణ చేస్తే రైతులు స్వచ్ఛందంగా అసలు సొమ్ములు చెల్లించడం జరుగుతుందని లేని పక్షంలో ఎవరూ ఏం కట్టరని తెలిపారు. దీంతో పర్సన్ ఇన్‌చార్జి ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సమావేశాన్ని వాయిదా వేశారు.



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న నాయకులు, ప్రజలు

పేదలకు భూములు ఇప్పించాలని ధర్నా

ఏలేశ్వరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల భూములు ఆక్రమదారుల నుంచి తీసుకుని పేదలకు ఇప్పించాలంటూ ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సోమవారం సీపీఐఎంఎల్ పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కొసి రెడ్డి గణేశ్వరరావు నేతృత్వంలో మండలంలోని జె.అన్నవరం, తిరుమాలి గ్రామాల్లో ప్రభుత్వ భూమిని మాజేటి జగన్మోహనరావు, వాగు గణేశ్వరరావు పేదలకు ఇచ్చిన భూములకు తప్పుడు పట్టాలు చూపిస్తూ ఆక్రమించుకున్నారని తక్షణం రెవెన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి భూములను ప్రజలకు ఇప్పించాలని తహశీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. సోమాల కువల, మసిరపు రాజారావు, వెంకటలక్ష్మి, దొమ్మేటి లక్ష్మీ పాల్గొన్నారు.

'వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి'

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వలంటీర్ల పునఃనియామకాలు చేపట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ గ్రామవార్డు వలంటీర్ల యూనియన్ ఆధ్వర్యంలో మండల వలంటీర్లు సోమవారం ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు. ఆందోళనకు నాయకత్వం వహించిన సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 28న కాకినాడలో వలంటీర్ల సమస్యపై భారీ ప్రదర్శన జరుగుతుందన్నారు. మండల వలంటీర్ల సంఘ నాయకులు నానిపల్లి జాకబ్, మోరుకుర్తి సతీష్‌కుమార్, ఎం.సత్తిబాబు, పి.భవాని, దొర, అనిత, రాజేష్, ప్రశాంత్, నాగమణి ఉన్నారు.

హౌసింగ్ డీఈగా సువర్ణరాజు

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు హౌసింగ్ డీఈగా సువర్ణరాజు బాధ్యతలు చేపట్టారు. ఏలూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడ విధుల్లోకి జాయిన్ అయ్యారు. గతంలో ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈగా కూడా పనిచేశారు. సోమవారం గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో సువర్ణరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో గృహ నిర్మాణ శాఖ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

జగ్గంపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సోమవారం జరిగింది. ఉపాధ్యాయులు తాతరావు, సుబ్బయ్య, కనకవల్లి, తాతాజీ, చక్రధర్, సతీష్, అంజనేయులు, అచ్యుతరావు, పూర్వ విద్యార్థులు తొట్టిపూడి రాజా, మిరియాల బద్రి, గజ్జి సురేష్‌కుమార్, చింత రాజశేఖర్, చింత శ్రీధర్, దుక్కశివ, సత్తిబాబు, కర్రి పూర్ణ అంబిక, అంకం దేవి, మంగతాయారు. పద్మాలత, రమాదేవి, ప్రశాంత్, సతీష్, మణికంఠ, అర్జున్ పాల్గొన్నారు.

కోడిపందాల శిబిరంపై దాడి

జగ్గంపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో కాట్రావుపల్లి గ్రామ శివారులో కోడిపందాల శిబిరంపై దాడులు నిర్వహించినట్లు జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు తెలిపారు. ఇద్దరని అదుపులోకి తీసుకుని వారి నుంచి 2 కోడి పుంజులు, 2కోడి కత్తులు, నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నేడు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రత్తిపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 209 మంది దివ్యాంగులకు మంగళవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో ఉపకరణాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో కుమార్‌బాబు తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చేతులమీదుగా దివ్యాంగులకు వీల్‌చైర్లు, బ్యాటరీ చైర్‌లు, చేతికర్రలు, చెవిటి మిషన్లు తదితర ఉపకరణాలు అందజేస్తారని చెప్పారు.

కష్టపడి పని చేసేవారికి సముచిత స్థానం

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



టీడీపీలో చేరినవారితో మాజీ మంత్రి యనమల

తుని రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే నాయకులకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్ద ఎత్తున వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన నాయకులకు యనమల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ప్రజలకు, పార్టీకి మధ్య వారధులుగా వ్యవహరించి ప్రజా మన్నలు పొందేలా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. వందరోజుల్లో ప్రభుత్వం కూటమి ప్రజలు మనస్సు గెలుచుకుందని, ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయని తెలిపారు. తిమ్మాపురం టీడీపీ మాజీ సర్పంచ్ కాపారపు అబ్బులు, అచ్యుతరావు పాల్గొన్నారు.

'ఆదిత్య' ప్రొఫెసర్‌కు డాక్టరేట్



పవన్‌కుమార్

గండేపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో ఈఈఈ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న కెకె.పవన్‌కుమార్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చార్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్టు యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ డి.చంద్రదాస్, డాక్టర్ ఎస్.నిర్మల నేతృత్వంలో కాంప్రెహెన్సివ్ కంట్రోల్ స్ట్రాటజీస్ ఫర్ వోల్టేజ్ అండ్ లోడ్ ఫ్రీక్వెన్సీ స్టెబిలైజేషన్ ఆఫ్ హైబ్రిడ్ పవర్ సిస్టమ్స్ అనే అంశంపై పవన్‌కుమార్ సమర్పించిన థీసిస్‌కు డాక్టరేట్ పొందారని తెలిపారు. ఆయన్ని ఆదిత్య చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలాసంజయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

రేపు డయల్ యువర్ డీఎం

ఏలేశ్వరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్టు డిపో మేనేజర్ జి.సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు, వారి నుంచి సలహాలు సూచనల స్వీకరించేందుకు బుధ వారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్య క్ర మం నిర్వహిస్తామని, 9959225532 నెంబరులో సంప్రదించాలని కోరారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కిర్లంపూడి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి రమణయ్యపేటకు చెందిన నక్కరాజు రమణ రూ.5లక్షలు అప్పు చేసి వాటిని తీర్చే మార్గంలేక ఈనెల 13న గడ్డి మందు తాగాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడు కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు కిర్లంపూడి హెచ్‌సీ అప్పారావు తెలిపారు.